నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
శనివారం | 03 ఆగష్టు 2024 | www.navatelangana.com

నారాయణఖేడ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుక్రవారం హైదరాబాదులో వినతి పత్రం అందజేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చెప్పారు. అంతేకాకుండా అన్ని నియోజకవర్గాలకు సమాన స్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రత్యేక అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవ తెలంగాణ-తూప్రాన్

స్వచ్ఛదనం - పచ్చదనంలి కార్యక్రమాన్ని విజయవ విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈవో ఎల్లయ్య కోరారు. తూప్రాన్ ఎంపీపీ కార్యాలయంలో స్వచ్ఛదనం పచ్చదనం అనే కార్యక్రమంపై జెడ్పీ సీఈవో ఎల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రత, పచ్చాదనాన్ని నిర్వహించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి 5వ తేది నుంచి 9వ తేది వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాలను రోజువారీగా క్రమపద్ధతిలో శుభ్రపరచాలన్నారు. గృహ,కమ్యూనిటీ స్థాయిలోనూ తోటల పెంపకం చేపట్టాలన్నారు. దీనికి సంబంధించిన రోజు వారి కార్యక్రమాలను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎల్పీవో యాదయ్య, ఎంపీడీవో శేషాద్రి, ఎంపివో సతీష్, సీనియర్ అసిస్టెంట్ సుభాషిణి, జూనియర్ అసిస్టెంట్ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శులు కల్పన, ఎస్.అరుణ, రాధిక, శరత్, సంతోష్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం



- గ్రామానికో జూనియర్ రెవెన్యూ అధికారి
- వీఆర్ఓ, వీఆర్ఎలకు ప్రాధాన్యం
- ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు దోహదం
- జేఆర్ఓల నియామకానికి సీసీఎల్ఎ ఆమోదం
- ఆర్థిక భారం పడకుండా రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామ రెవెన్యూ వ్యవస్థ అవసరం ఎంతో ఉంది. 1992లో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ)కు పేస్కేల్ ఇచ్చి సొంత గ్రామాల నుంచి బదిలీ చేశారు. 2004లో అధికారంలోకి వచ్చిక కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో పంచాయతీ, రెవెన్యూ శాఖలను వేరు చేసి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక పంచాయతీ కార్యదర్శి, ఒక వీఆర్ఎను నియమించారు. అంతకు ముందు పటేల్ పట్వారీ వ్యవస్థ అమల్లో ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2020లో వీఆర్ఓ, వీఆర్ఎలను తొలగించి ఇతర ప్రభుత్వ శాఖల్లో బదలాయించారు. అప్పటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ లేకుండా పోయింది. ప్రభుత్వ పరంగా పంచాయతీ కార్యదర్శి మాత్రమే అన్ని పనులు చేయలేకపోతున్నారు

> గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ లేకపోవడంతో ఏ చిన్న పనిపడినా జనం ఎవరికి చెప్పాలో అర్థంకాని పరిస్థితి ఉంది. గతంలో వీఆర్ఓ, వీఆర్ఎల వ్యవస్థ ఉండేది. భూ సమస్యలైనా సంక్షేమ పథకాలు, అభివృద్ధి, విపత్తులు, అత్యవసరాలు, ఎన్నికలు ఇలా ఏదైనా సరే వాళ్ల తోడ్పాటు ఉండేది. ప్రస్తుతం గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. గ్రామానికో జూనియర్ రెవెన్యూ అధికారిని నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సీసీఎల్ఎ ఆమోదం తెలపడంతో ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే వీలుంది. రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిని నియమించడం ద్వారా రెవెన్యూ వ్యవస్థను నెలకొల్పాలని ప్రభుత్వం చూస్తుంది. తద్వారా ప్రభుత్వ భూముల పరిరక్షణ, క్షేత్ర విచారణ, పథకాలకు అర్హుల గుర్తింపు, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో తోడ్పాటు అందేలా మార్పులు

గ్రామ రెవెన్యూ వ్యస్థ ఎంతో కీలకం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో ఊరికో వీఆర్ఓ ఉండేది. అలాగే జనాభాను బట్టి ఊరికి ఒకరు, ఇద్దరు, ముగ్గురు చొప్పున వీఆర్ఎలు కూడా పనిచేశారు. 2600 మంది వరకు ఉండేది. అయితే గ్రామాల్లో భూములు, చెర్వులు, నీటి వనరులు, అడవులు, ఇతర ఖనిజ సంపద, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, విపత్తులు, అత్యవసర పరిస్థితులు, ఎన్నికలు ఇలా ప్రతి పనిలోనూ రెవెన్యూ వ్యవస్థ అవసరముంటుంది. ముఖ్యంగా రెవెన్యూ గ్రామంలో ఉన్న భూములు, ప్రభుత్వ భూములు, పొరంబోకు, అసైన్డ్, చెరువు శిఖం, బంచరాయి, దేవాదాయ, వక్ఫ్, ఇనాం, ఆవాక్కు ప్రాపర్టీ వంటి భూములకు సంబందించిన సమాచారం గతంలో వీఆర్ఓ, వీఆర్ఎల దగ్గర రికార్డుల రూపంలో ఉండేది. ధరణీ పోర్టర్ వచ్చాక గ్రామాల్లో భూములకు సంబంధించిన ఏలాంటి సమాచారాల్లేకుండా పోయాయి. రికార్డులన్నీటినీ ఆన్‌లైన్‌లో పొందుపర్చి తహసీల్దార్ కార్యాలయంలో పడేశారు. ధరణీ వచ్చాక అనేక భూ సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా పేదలకు చెందిన అసైన్డ్, ఇతర భూముల రికార్డులన్నీ తారుమారయ్యాయి. నిషేధిత జాబితాలో చేర్చబడి పేదలకు హక్కుల్లేకుండా చేశారు. ఊర్లో వ్యవసాయ భూములు, గుట్టలు, చెర్వుకుంటలు, రహదారులు, గ్రామ కంఠం భూములు వివరాలు చెప్పే వాళ్లలేకపోవడంతో గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పైసలు పాసుబుక్ ఉంటే చాలు అందరికీ ఇచ్చేశారు. ఊర్లోకి ఏ ప్రభుత్వ అధికారైనా వస్తే వారికి సహకరించడం, సమాచారం ఇచ్చే వారు ఎవరు అనేది ప్రశ్నార్థకమైంది. ఎవరి భూములు ఎక్కడ ఉన్నాయో తెలిపే వారు లేరు. గ్రామాల్లో నేరాలు, తగాదాలు జరిగితే వెంటనే పోలీసులకు పిర్యాదు చేసి శాంతిభద్రతలను కాపాడేందుకు ఎవరూ పూనుకునే పరిస్థితి లేదు. గతంలో వీఆర్ఓ, వీఆర్ఎలు ఈ పనిని చేసేది. ఎన్నికలొస్తే ఓటర్ల గుర్తింపు, చేర్పులు మార్పులు, ఎన్నికల నిర్వహణ సమయంలో వీరి పాత్ర కీకలంగా ఉండేది. వరదలు, వర్షాలు, పిడుగు పడడం, అగ్నిప్రదామాలు, భూకంపాల వంటి విపత్తులు సంభవిస్తే కూడా పట్టించుకునే తక్షణ సహాయక చర్యలకు పూనుకునేలా చేసేది. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లోనూ పట్టించుకునే వాళ్లులేరు. బ్యాంకు అధికారులకు సమాచారం ఇవ్వడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో అర్హుల్ని గుర్తించే విషయంలోనూ రెవెన్యూ వ్యవస్థ కీకలంగా వ్యవహరించేది.

గ్రామానికో జూనియర్ రెవెన్యూ అధికారి

గతంలో ఉన్న రెవెన్యూ వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఇప్పటికే సీఎం, మంత్రివర్గం కొన్ని ప్రతిపాదనలు చేశారు. గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థను నెలకొల్పేందుకు ఏలాంటి నిర్మాణం చేయాలనే విషయాలపై సమీక్షించారు. ఇప్పటికే సీసీఎల్ కొన్ని ప్రతిపాదనల్ని ప్రభుత్వం ముందు పెట్టింది. గ్రామ జూనియర్ రెవెన్యూ అధికారి (జేఆర్ఓ) లేదంటే గ్రామ రెవెన్యూ అధికారి పేరుతో గ్రామానికొకర్ని నియమించనున్నారు. ఇతర శాఖలకు బదలాయించిన వీఆర్ఎ, వీఆర్ఎఓలలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారికి జేఆర్ఓ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామాలున్నందున అంత మంది జేఆర్ఓలను నియమించే అవకాశముంది. సంగారెడ్డి 647, మెదక్ జిల్లాలో 479, సిద్దిపేట జిల్లాలో 499 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసే జేఆర్ఓల ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక పరమైన భారం పడకుండా కొత్త రిక్రూట్‌మెంట్ చేయకుండా ఇప్పటికే ఉద్యోగంలో ఉన్న వాళ్లనే సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు.

జహీరాబాద్ రూరల్ సీఐకి సన్మానం



నవతెలంగాణ-న్యాల్‌కల్

జహీరాబాద్ రూరల్ సీఐగా ఇటీవలే బదిలీపై వచ్చిన జక్కుల హనుమంతును సర్కిల్ కార్యాలయంలో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు శాలువాతో శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలకు ఎల్లవేళలా సహకరించాలని నాయకులకు కోరారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచులు మాతంశెట్టి రాజ్‌కుమార్, మారుతీ యాదవ్, మల్‌రెడ్డి, అమీర్ తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వగా.. అసెంబ్లీలో ఆమోదం తెలపడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి డీసీసీ కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాలా భిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కు మద్దతు తెలిపిన ముఖ్యమంత్రికి ఎస్సీ నాయకులు, ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోలో జైరాజ్, కృష్ణ, అమృత్, శ్రీకాంత్, శ్రీకాంత్, మరిడీ సాయిలు, బీబీపెట్ సాయిలు, స్వామిదస్, అర్జున్ రమేష్ చౌహన్, పరుశురాం, గుండెరావు, సిద్దరెడ్డి, సచిన్ పాటిల్, జుల్యా నాయక్, సంజు రావు, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల స్ట్రీట్ చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. అణగారిన వర్గాల దశాబ్దాల పోరాటానికి న్యాయం జరిగింద న్నారు. ఈ 30 ఏండ్ల ప్ర స్థానంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో మంది మాదిగ జాతిబిడ్డలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఆ అమరుల త్యాగఫలమే ఈ విజయమన్నారు. ఎస్సీ వర్గీకర ణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ, మాదిగ సమాజాని కి, ఉపకులాలకు ఎమ్మార్పీఎస్ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఫోటో వీడియో గ్రాఫర్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మండల ఫోటో వీడియో గ్రాఫర్‌ల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సుప్పాల శ్రీనివాస్, కోశాధికారి ప్రభాకర్ సంగారెడ్డి పట్టణ పెద్దలు, సలహాదారుల సమక్షంలో ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బాలాజీ సతీష్‌ను, ప్రధాన కార్యదర్శిగా భూమయ్యను, కోశాధికారిగా శామల మురళిని, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్, రాజులను, ఉపాధ్యక్షునిగా ఆంజనేయులు, యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఫోటోగ్రాఫర్లు ఆషాడమాసం వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు కొండాపురం జగన్, ఫోటోగ్రాఫర్లు ప్రభు, అప్ప, గోపాల్, సురేందర్, మాజీ పట్టణ అధ్యక్షులు నర్సింలు, రవి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



నవతెలంగాణ-బెజ్జంకి

పౌష్టికాహారంతోనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యమని, అంగన్వాడీ కేంద్రం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని పంచాయితీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాపన్నపల్లిలో తల్లిపాల వారోత్సవాలపై ప్రజలకు ప్రనీత్ రెడ్డి ఆశా కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ ఉపాధ్యాయురాలు, మహిళలు పాల్గొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావుల దిష్టిబొమ్మలు దగ్ధం



నవతెలంగాణ-సిద్దిపేట

అసెంబ్లీలో సమయాన్ని వృధా చేస్తూ, ప్రజలను పక్కదారి పట్టించే విధంగా కేటీఆర్, హరీష్‌రావు మాట్లాడుతున్నారని, వారి దిష్టిబొమ్మలని దగ్ధం చేసినట్లు కాంగ్రెస్ జిల్లా నాయకులు మార్కా సతీష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఇందిరాగాంధీ విగ్రహం వద్ద హరీశ్‌రావు కేటీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాస అంజయ్య, అనిల్ కుమార్, పుట్ల యేసు, మల్లేశం, గౌస్మియా బిజని, స్రవంతి, రజిని, సంతోషి, రమ , పద్మ, నరేష్, కిషోర్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ ప్రేరణ



నవతెలంగాణ - సిద్దిపేట

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ ప్రేరణ పాఠశాల యాజమాన్యానికి సూచించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశాల మేరకు పట్టణంలోని వికాస్ హై స్కూల్ హాస్టల్‌ను పరిశీలించినట్లు తెలిపారు. స్కూల్‌లోని హాస్టల్లో గదులు, వంటగది, వంట సరుకుకు భద్రపరిచే గది, వాష్ రూం, పడక గదులు, కార్యాలయాన్ని పరిశీలించి, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించినట్లు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం వలన దోమలు, ఈగలు వ్యాప్తి చెంది పలు రకాల వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. హాస్టల్ పరిసరాలలో ఎక్కడ కూడా వర్షపు నిల్వ ఉండకుండా ప్రతిరోజు నీటి హౌస్‌లో, డ్రమ్ములలో గానీ , బయట అవరణలో ఎక్కడైనా టైర్‌లలో, పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే ధరణి దరఖాస్తుల రిజెక్షన్..

- వెంటనే కోహిర్ తహసీల్దార్, ఆర్ఐను సస్పెండ్ చేయాలి
- ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా, వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గం పరధిలో గల కోహిర్ మండలంలోని మాచిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ధరణి దరఖాస్తులను విచారణ చేయకుండా.. ఉద్దేశపూర్వకంగా రిజెక్ట్ చేసిన తహసీల్దార్, ఆర్ఐలను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట బాధితులతో కలసి ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ.. కోహిర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామ రైతులు తమకు కొత్తపాస్ బుక్స్ కోసం, ధరణి వచ్చిన నాటినుంచి సమస్యలను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. అయినా వారి భూములకు కొత్తపాస్ బుక్స్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పంటలు సాగు చేస్తున్న రైతుల భూముల్లో రెవెన్యూశాఖ అధికారులు సర్వే చేశారని.. అంతేకాకుండా ఆ భూములకు సంబంధించి పొజిషన్‌లో లేరని తహసీల్దార్, ఆర్ఐలు ఆర్డీఓకు పంపిం చిన రిపోర్ట్‌లో చూయించారని ఇదెక్కడి న్యాయమన్నారు. రిజెక్ట్ చేసిన ఫైల్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వారం రోజుల పాటు నిర్వహించిన గ్రామసభలో ఓకే చేసిన పేర్లను ఏ విధంగా రిజెక్ట్ చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. పంటలు సాగు చేసుకున్న రైతులను అకారణంగా రిజెక్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మండలంలో తహసీల్దార్, ఆర్ఐ ఇష్టమొచ్చినట్టు వ్యవహ రిస్తూ రైతులను ఇబ్బంది పెటుతున్నారని ఆరోపించారు. రైతుల దరఖాస్తులను రిజెక్ట్ చేసిన దానిపై విచారణ చేయా లని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పై జిల్లా కలెక్టర్‌కి, రాష్ట్ర సీసీఏకు, రాష్ట్ర ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, రవీందర్, చంద్రయ్య, దేవయ్య, రాములు, మారుపల్లి, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యారంగా సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభు త్వం విఫలం అయ్యిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్ ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశాన్ని స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూని యర్ కళాశాలలో మంచినీటి సౌకర్యం తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ స్కూల్స్‌కు తక్షణమే నూతన భవనాలు నిర్మించాలన్నారు. ఆరేండ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ రూ.8,192 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్స్ పెంచాలన్నారు. సంక్షేమ వసతి గృహ విద్యా ర్థులకు మెస్‌కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశా రు. స్కాలర్షిప్స్‌తో సంబంధం లేకుండా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. సెల్ఫ్‌ఫైనాన్స్ చదువుతున్న విద్యా ర్థుల కు ఫీజు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణ మే విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొర వ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్, అధ్యక్షులు, రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు వాణి, స్వప్న, శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు,అర్జున్, హరీష్, ప్రశాంత్, వైశాలి పాల్గొన్నారు.

కాలుష్య జలాలతో పశువులు మృత్యువాత





నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని కాజిపల్లి పారిశ్రామికవాడలో కాలుష్య జలాలను తాగి రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. బాధిత వ్యక్తి అబ్దుల్ హకీమ్, కాజిపల్లి జేఏసీ చైర్మెన్ దండే రమాకాంత్, కాజిపల్లి వాసులు తెలిపిన వివరా ల ప్రకారం.. స్థానికంగా గల ధర్మి చెరువులోకి అక్రమంగా కాలుష్య జలాలు వదలడంతో నీరు మొత్తం కాలుష్యమైంది. ఆ నీటి తాగడంతో రెండు పశువులు(ఎద్దు, ఆవు) మృత్యు వాత పడ్డాయి. కాలుష్య జలాలకు కారకులైన సదరు పరిశ్ర మలు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దండే రమాకాంత్ కోరారు. అంతేకాకుండా ఇటీవలే అభిమన్యుకు చెందిన ఓ పశువు కూడా మృత్యువాత పడిందన్నారు. చెరు వుకుంటల సహజ అస్తిత్వాన్ని ప్రకృతి సిద్ధమైన ఆహ్లాదక రమైన వాతావరణాన్ని ఈ ప్రాంతంలో కాలుష్యపూరిత వా తావరణంగా మారుస్తున్న కాలుష్యకారక పరిశ్రమలపై వెం టనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎందరో అమరవీరుల త్యాగఫలమే ఏబిసిడి వర్గీకరణ



నవతెలంగాణ-గుమ్మడిదల

ఎందరో అమరుల త్యాగఫలమే ఏబీసీడీ వర్గీకరణకు సుప్రీంకోర్ట్ అనుకూలంగా తీర్పునివ్వడం అని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడన్నోళ్ల సుదర్శన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మడిదల మండల కేంద్రంలో వివిధ గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్ర మానికి ప్రత్యేక ఆహ్వానితులుగా మైత్రి ఫౌండేషన్ చైర్మెన్, బీజేపీ ఓబిసి కార్యదర్శి చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ హాజర య్యారు. అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ.. ఏబిసిడి వర్గీకరణ కోసం గత 30 ఏండ్లుగా పోరాటం జరుగుతు న్నదన్నారు. పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేశాన్నారు. ఈ నేపథ్యంలో గత పాలకులు ఏబిసిడి వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. దాంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. సుదీర్ఘ కాలం తర్వాత గురువారం ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చిందన్నారు. ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని తీర్పునివ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు మండల గ్రామాల వారిగా అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు, పాలాభిషేకాలు చేశారు. టపాకాయలు కాల్చి.. మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తుడుం శ్రీనివాస్, మరిగాని యాదగిరి, తుడుం సాయిలు, గుండగళ్ళ సత్యనారాయణ, యాదగిరి, రమేష్, వర ప్రసాద్, శివకుమార్, రాజు, ఎర్రోళ్ల శంకర్, బాలకృష్ణ, నవీన్, బుడగ జంగాల ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య



నవతెలంగాణ-చేర్యాల

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అకునూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం వెంకటేశ్వర్లు చిన్న కుమార్తె మహేశ్వరి (25) పెండ్లి విషయంలో మానసిక ఒత్తిడికి లోనై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగిందని, ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని డాక్టర్లు ధృవీకరించారు. యువతి తండ్రి పుప్పాల వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దామోదర్ తెలిపారు.

రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ మను చౌదరి



నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని రైతు బజార్లో రైతులకు, కొనుగోలుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజును ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సిద్దిపేట పట్టణంలోని రైతు బజార్‌ను సందర్శించి, రైతులు అమ్ముకోవడానికి వినియోగదారులు, కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేయడానికి ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 350 నుంచి 400 మంది రైతులు కూరగాయలను తీసుకువచ్చి అమ్ముతారని, నలుగురు వాచ్మెన్‌లు, నలుగురు శానిటేషన్ సిబ్బంది, ఒక ఎస్టేట్ అధికారి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన తాజా కూరగాయలు, ఆకుకూరలను అందుబాటులో ఉంచడానికి , రైతుల పండించిన కూరగాయలను, ఆకు కూరలను సులభంగా అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ రైతు బజార్ మంచి సేవలు అందిస్తుందన్నారు. రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, మరుగుదొడ్డి లాంటి సౌకర్యాలకు ఆటంకం కలగకుండా చూడాలని అన్నారు. బోర్డు పై సూచించిన ధరలకే క్రయవిక్రయాలు జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. అంతకుముందు పట్టణంలో గల సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, బ్యూటీషియన్, మెహందీ డిజైన్స్, నోట్ బుక్స్ మేకింగ్ మగ్గం వర్క్‌ను విద్యార్థులు ఎలా నేర్చుకుంటున్నారో పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన వస్తువులను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా బ్యాచ్‌ల వారీగా ఎప్పటికీ సెట్విన్‌లో 150 నుంచి 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారని, శిక్షణ పొందిన వారు ప్రభుత్వ ఉద్యోగాలను పొందడంతో పాటు ప్రయివేటుగా చాలా ఉపాధి అవకాశాలను పొందుతున్నారని సెట్విన్ కోఆర్డినేటర్ అమీనా జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెట్విన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా ఉత్తమ పనితీరు కనబరిచేలా శిక్షణ ఇవ్వాలన్నారు. కంప్యూటర్ కోర్సులలో బేసిక్ పరిజ్ఞానంతో పాటు ఆధునిక అంశాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ పొందిన వారు తయారు చేసే వస్తువులను మార్కెటింగ్ చేసేందుకు ఒక ప్రత్యేక వెబ్సైట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, తద్వారా శిక్షణతో పాటు వారు తయారు చేసే వస్తువులకు మార్కెట్లో అధికంగా డిమాండ్ వచ్చేలా అవుతుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



నవతెలంగాణ-బెజ్జంకి

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పంచాయితీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి ప్రజలకు సూచించారు. డ్రైడే ఫ్రైడే సందర్భంగా పాపన్నపల్లిలోని ఇంటింటా పంచాయితీ కార్యదర్శి ఆశా కార్యకర్తలతో సందర్శించి తొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, వెంకట లక్ష్మి, సౌమ్య, రేణుకా, రజిత, రజిని పాల్గొన్నారు.

పరిసరాలు బాగుంటేనే ఆరోగ్యం



నవతెలంగాణ-ఝరాసంగం

ఇంటి పరిసరాలు బాగుంటేనే ప్రజలు రోగాల వారిని పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటారని అందుకు ప్రతి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండలాభివృద్ధి అధికారి సుధాకర్ అన్నారు. మండల మండల కేంద్రంతో పాటు కంబాలపల్లి గ్రామాల్లో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు రోగాల బారినపడకుండా తగు జాగ్రత్తలు తీసుకో వాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఐనిష్, పంచాయతీ కార్యదర్శులు సరస్వతి, నవీద్ అంగన్వాడి టీచర్లు, ఏఎస్ఎంలు ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయపాడు గ్రామంలో ఘనంగా బోనాల పండుగ



నవతెలంగాణ-పుల్కల్

ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని పుల్కల్ మండల పరిధిలోని రాయపాడు గ్రామంలో కుల మతాలకతీతంగా.. పార్టీలకతీతంగా శుక్రవారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. గ్రామ నడిబొడ్డులో ఉన్న పోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పించి నూనె పోలేలు, పెరుగు అన్నంను అమ్మవార్లకు నైవేద్యంగా పెట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పొలిమేరలో ఉన్న దుర్గా భవాని దేవస్థానం వరకు బోనాల ఊరేగింపును డప్పు వాయిద్యాల మధ్య పెద్ద ఎత్తున తీసుకెళ్లారు. ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లకు మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మ నర్సింలు, మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశం, నాయకులు మాణిక్యం, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జిన్నారం

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో పాలాభిషేకం చేశారు. అంతకుముందు పార్టీ మండలా ధ్యక్షులు వడ్డే కృష్ణ ఆధ్వర్యంలో స్థానికంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగు రమేష్, మాజీ ఎంపిటిసి జనాభాయ్, నాయకులు సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు.

కోడిపాక గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం



నవతెలంగాణ-హత్నూర

మండలంలోని కోడిపాక గ్రామంలో సంగారెడ్డి జిల్లా వెల్నెస్ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఈసీజీ, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారుగా 100 మంది గ్రామ ప్రజలు పాల్గొని ఆరోగ్య పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ హాస్పిటల్ మేనేజర్ శివరామకృష్ణ, గ్రామ మాజీ సర్పంచ్ మాధవి బాబు యాదవ్, గ్రామస్తులు మాధవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, దేవేందర్, కుమార్, మైబుష్ వెల్నెస్ హాస్పటల్ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని టిఫిన్ సెంటర్స్, లక్కీ రెస్టారెంట్, టీ టైం హెూటళ్లను గ్రామ (స్పెషల్ ఆఫీసర్) పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్ శుక్రవారం తనిఖీ చేసి.. ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని యజమానులకు సూచించారు., కల్తీ నూనె,కల్తీ పదార్థాలు, చికెన్, మటన్ ఫ్రెష్‌గా ఉండే విధంగా చూసుకోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా చికెన్ షాప్‌లను తనిఖీ చేసి కోళ్ల వ్యర్థాలను రోడ్డు పక్కల వేయొద్దని.. ప్రజలకు దుర్వాసన రాకుండా చూసుకోవాలన్నారు.

పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు



నవతెలంగాణ-కంగ్టి

మండలంలోని సిద్ధహంగీర్గ, దెగుల్వాడి గ్రామాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ప్రశాంతి మాట్లాడుతూ.. బిడ్డపుట్టగానే గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని రేచీకటి రాకుండా చూస్తుందన్నారు.అరు నెలల వరకు తప్పకుండా తల్లిపాలే ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా అరునెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విద్యావతి, ఇందు బాయి, రమాదేవి, ఆశావర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

అరెస్టులతో పోరాటం ఆపలేరు



నవతెలంగాణ-జిన్నారం

అరెస్టులతో ప్రభుత్వం సర్పంచుల పోరాటాన్ని ఆపలేదని జిన్నారం మండల సర్పంచ్ల ఫోరం మాజీ అధ్యక్షులు, కొడకంచి మాజీ మాజీ సర్పంచ్ శివరాజ్ అన్నారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే.. ప్రభుత్వం అనిచివేతతో అరెస్టులు చేయిస్తున్నదని విమర్శించారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొడకంచి సర్పంచ్ శివ రాజ్, ఉట్ల సర్పంచ్ ఆంజనేయులు, అండూర్ సర్పంచ్ కదీర్, నల్తూరు సర్పంచ్ జనార్ధన్, జంగంపేట్ సర్పంచ్ వెంకటయ్య, శివనగర్ కృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-ఝరాసంగం

అర్హులైన ప్రతీ ఒక్కరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ తెలిపారు. సందర్భంగా అయన మాట్లాడుతూ.. జూన్ 28 తేది వరకు కొత్త పాస్ బుక్ వచ్చిన రైతులు భీమ చేసుకోవాలన్నారు. దరఖాస్తు కు చివరి తేదీ 5 ఆగస్టు 2024 న ముగుస్తుందన్నారు. 18 నుంచి 59 ఏండ్ల వయస్సున రైతులు అర్హులన్నారు. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్, రైతుబీమా అప్లికేషన్ ఫారంతో పాటు స్వయంగా రైతు వచ్చి దరఖాస్తు వ్యవసాయ విస్తరణ అధికారాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుకుమార్ రైతులు నవీన్, పటేల్, యేసయ్య, నర్సయ్య తదితులున్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కొండాపూర్



జూన్ నెల 28లోపు నూతనంగా పట్టాదా రు పాసు పుస్తకం పొందిన రైతులు సంబంధిత మండల కేంద్రంలోని వ్యవసాయ రైతు వేదిక వద్ద రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ మనోహర్ రైతులకు సూచించారు. రైతు బీమాకు 1965 ఆగస్టు నెల 14వ తేదీ నుండి 2006 ఆగస్టు నెల 14వ తేదీ మధ్యలో జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, పాసుపుస్తకం జిరాక్స్‌లు.. దరఖాస్తు ఫారంతో పాటు జతచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారి వివరాలు గ్రామపంచాయతీలో ఆవరణలో లిస్టు వేస్తామన్నారు.

నూతన చట్టాల అమలు తీరుపై ఎస్పీ రివ్యూ మీటింగ్

- బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



నవతెలంగాణ-సంగారెడ్డి

కొత్త చట్టాలైన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. గత నెల జూలై 1వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన నూతన చట్టాల అమలులో సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ సమర్థవంతంగా నూతన చట్టాలను అమలు పరచడం జరుగుతుందని అన్నారు. అధికారులు నూతన చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని, నూతన చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్ధవంతంగా విధులు నిర్వహించగలం అని, అందుకు ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది విధిగా నూతన చట్టాలను తెలుసుకొని వుండాలని సూచించారు.ఆన్లైన్ లో వచ్చిన ఫిర్యాదును సైతం స్వీకరించి, ముందస్తు విచారణ చేయా లని సూచించారు. అవసరమైన కేసుల్లో సంబంధిత అధికారుల ఉత్తర్వులు పొంది ప్రాథమిక విచారణ చేయవచ్చు అన్నారు. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు కలిసి నేరాలకు పాల్పడితే ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ కేసులో నేరస్థల ఫోటోలు, వీడియో రికార్డు చేయాలని, గ్రేవ్ కేసుల్లో అరెస్ట్ చేసిన నేరస్తులకు హ్యాండ్ కాఫ్స్ వేయాలని సూచించారు. ఇకనుంచి నూతన చట్టాల ప్రకారం సమన్స్, వారెంట్స్ ఆన్లైన్ (సోషల్ మీడియా) ద్వారా అందజేయవచ్చు అన్నారు.కొత్త చట్టాల అమలులో మంచి పనితీరు కనబరిచిన అధికారులు రివార్డులు ప్రకటించడం జరుగుతుందన్నారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-సదాశివపేట

డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడం అందరి బాధ్యత అని సదాశివపేట సీఐ మహేష్ గౌడ్ అన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న అవగాహనా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతను గంజాయి, డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రగ్స్ మాఫియాను అంతమొందించడం కోసం పోలీసు శాఖ నుంచి కృషి చేస్తున్నామన్నారు. నేటి(శనివారం) ఉదయం 10 గంటలకు సదాశివపేటలోని భవిత జూనియర్ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహనా సదస్సును నిర్వహించడం మంచి విషయమన్నారు. అనంతరం డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. ఈ అవగాహన కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకట్, డాక్టర్ కృష్ణమూర్తి హాజరై.. డ్రగ్స్ మహమ్మారి వల్ల ఎదురయ్యే పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. కాబట్టి ఈ కార్యక్రమాన్ని విద్యార్థి లోకం, యువత, మేధావులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో మహేష్, ఎంఏ గని, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-హత్నూర

సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతి ఉత్సవాల సందర్భంగా 'అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర'ను దేవులపల్లి గ్రామంలో గల సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి బైక్ ర్యాలీతో దౌల్తాబాద్, వడ్డేపల్లి అయా గ్రామాల నుంచి షేర్‌ఖాన్‌పల్లి పలుగు మీ పోచమ్మ వరకు తెలంగాణ కలుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొనసాగించారు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లూరి గీత కార్మిక సంఘం అధ్యక్షులు ఆచన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్‌లు మాటాడుతూ.. తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ నుంచి సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఆగస్టు 18 వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో గౌడ సంఘం సైనికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మొగుల్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు సర్వాయి పాపనాన్న అని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ.. గీత కార్మికులకు, కుల వృత్తులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెవడానికి గీతన్నల చైతన్య యాత్ర ఉపయోగపడుతుందన్నారు.కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, సంగారెడ్డి మండల ఉపాధ్యక్షులు కృష్ణా గౌడ్,రాజ గౌడ్, ఆంజనేయులు గౌడ్, శేఖర్‌గౌడ్, సురేష్‌గౌడ్, రంగన్నగౌడ్,లచ్చన్నగౌడ్, వెంకటేష్‌గౌడ్, యాద గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ ఏఎంసీ చైర్మెన్ రేసులో జి.దేవదాస్!

నవతెలంగాణ-కల్హేర్



నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్(ఏఎంసీ) పదవీని ఎస్సీ సామాజికవర్గానికి రిజర్వ్ చేయడంతో.. ఖేడ్ నియోజకవర్గంలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఆశావాహుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో కల్హేర్ మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన గైని దేవదాస్ చైర్మెన్ రేసులో ముందు వరుసలో ఉన్నారు. 30 ఏండ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ ఎలాంటి పదవులను ఆశించకుండా పార్టీకి విధేయుడై నిబద్ధత పని చేస్తున్నాడు. గెలుపోటములతో సంబంధం లేకుండా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నోమార్లు దేవదాసుపార్టీలోకి ఆహ్వానించినా.. నమ్మిన సిద్ధాంతాల కోసం ఆయన పార్టీ మారలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో, నియోజకవర్గంలోనూ తమ పార్టీనే అధికారంలో ఉండడంతో.. మార్కెట్ కమిటీ చైర్మెన్ తప్పకుండా ఆయనకే దక్కుతుందని జోరుగా చర్చ నడుస్తోంది. అంతేకాకుండా నారాయణఖేడ్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్ ఆశీస్సులు ఆయనకు ఉండడంతో.. పదవి వచ్చే అవకాశం ఉన్నట్టుగా పార్టీ వర్గాలు అనుకుంటున్నారు. మరోపక్క చైర్మెన్ పదవీ కోసం మనూరు మండల మాజీ జెడ్పీటీసీ నిరంజన్, కంగ్టి మండల మాజీ జెడ్పీటీసీ రవి, ఖేడ్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు సాంయిలు, చైర్మెన్ పదవీని ఆశిస్తున్నారు. అయినప్పటికీ గతంలో వారంతా కొన్ని అనివార్య కారణాలవల్ల కాంగ్రెస్ పార్టీని వీడి.. ఇతర పార్టీలోకి వెళ్లి తిరిగి మళ్ళీ కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఈ నేపథ్యంలో ఒక్కసారి కూడా పార్టీ మారని.. దేవదాస్‌కె చైర్మెన్ పదవీ వస్తుందని పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి.

బదిలీపై వెళ్తున్న సెక్రటరీలకు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల అభివృద్ధి కార్యాలయం నుంచి బదీలీపై వెళున్న 12 మంది పంచాయతీ సెక్రెటరీలకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. నాలుగేండ్లు ఇక్కడ పనిచేసిన సెక్రటరీలు బదిలీపై వెళ్తుండడంతో వారికి వీడ్కోలు చెబుతూ.. నూతన సెక్రెటరీలకు స్వాగతి పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ సాబేర్ హుస్సేన్ హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమే అన్నారు. విధి నిర్వాహణలో చేసిన సేవలే ఎళ్లకాలం గుర్తుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్, రాజేష్, పంచాయతీ సెక్రెట రీలు సంతోష్, శివశంకర్, తిరుపతి, చంద్రశేఖర్, బదిలీ అయిన అధికారులు శ్రీనివాస్ జోషి, రవీందర్, నాగభూషణం, ఈశ్వర్,చరణ్, నర్సింలు,గాయత్రి, శిల్ప తదితరులు ఉన్నారు.

అంత్యక్రియలకు వీవీఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని బీరప్పబస్తిలో నివసించే కర్ణాటక వాసి రాజ్యమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తూ వీవీఆర్ ఫౌండేషన్ తరపున అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 సాయాన్ని అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచిన వివిఆర్ ఫౌండేషన్ సభ్యులకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, స్థానికులు రాజ, సురేష్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెండు దఫాలుగా రూ.14.79 కోట్లు మాఫీ

నవతెలంగాణ-న్యాల్‌కల్



రైతులకు రెండు విడతల్లో రూ.14.79 కోట్లు రుణమాఫీ జరిగినట్టు కొత్తూరు (బి) కెనరా బ్యాంక్ మేనేజర్ తుల్జరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దఫాల్లో 1660 మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. కాగా మాఫీ అయిన వెంటనే వన్ బి, పహాని, ఈసీతో అకౌంట్లను రెగ్యులర్ చేసుకోవాలన్నారు. అలాగే సమీప బ్యాంక్ అధికారులకు సంప్రదించి లోన్లను రెన్యువల్ చేసుకోవాలన్నారు.

సీఎం ముఖాముఖి సమావేశానికి తరలిన ఉపాధ్యాయులు





నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవలే పదోన్నతి పొందిన 30వేల మంది ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన ముఖాముఖి సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సంగారెడ్డి జిల్లాలో అన్ని కెటగిరీల్ల కలిపి 928 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. కాగా సమావేశానికి వెళ్లడానికి సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు బస్సులను ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట్, పఠాన్ చెరు, సంగారెడ్డి నుండి బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతీ బస్సుకు ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇంచార్జిగా వ్యవహరించారు. తొమ్మిదేండ్లుగా పదోన్నతులు, ఆరేండ్లుగా బదిలీలు పెండింగులో ఉన్నప్పటికి కోర్టు కేసులు, అవాంతరాలు వచ్చినా విజయవంతంగా పూర్తి చేసి బదిలీలు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇదే చిత్తశుద్ధిని ప్రదర్శించి, విద్యారంగంలో మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. టీపీటీఎఫ్ తరపున జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సోమశేఖర్, లక్ష్మయ్య యాదవ్, పి. భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, కంది అధ్యక్షులు జనార్ధన్, బద్రప్ప,ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : పీఆర్‌టీయూర్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల మానయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని కోరారు.

మురుగు కాలువ నిర్మించి, రోడ్లకు మరమ్మతు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

మురుగు కాలువలు నిర్మించి రోడ్లు మరమ్మత్తు చేయాలని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి మున్సిపాల్టి పరిధిలోని 35 వార్డు ప్రశాంత్‌నగర్‌లో గల పాత మురుగు కాలువ లికేజీ అయి.. కొన్ని నెలలుగా ఇందిరాకాలని ప్రశాంత్‌నగర్ వెళ్లేదారిలో ప్రవహిస్తున్న మురుగు నీటి వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. అనతరం శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. మురికి కాలువ లికేజీ కావడంతో నీరు మొత్తం రోడ్డుపై నిల్చి మురుగు నీటి గుంతగా మారిందన్నారు. ఇందిర కాలని, పట్టణ ఆరోగ్యం కేంద్రానికి, రేషన్ దుకాణనికి, మస్జీద్‌కి ప్రార్థన కోసం ఇతర ప్రాంతాలకు రాకపోకలు చేసేవారికి ఇది ఇబ్బందిగా మారిందన్నారు. మురుగు నీటి పై దోమలు, ఈగలు పెరిగి మలేరియా డెంగ్యా లాంటి జ్వరాలు వచ్చే ప్రమాదం ఉన్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వ లికేజి సమస్యపై ప్రజాప్రతినిధులతో పాటు మున్సిపల్ కార్యాల యం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయడమే అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లు స్పందించి ప్రశాంత్‌నగర్‌లో శిథిలావస్తుకు చేరిన మురుగు కాలువ స్థానంలో కొత్త మురుగు కాల్వ నిర్మించాలన్నారు. రోడ్డు మీద మురుగు నీటి వల్ల ఏర్పడ్డ గుంతలను సీసీతో రోడ్డు మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మల్లమ్మ, అనుసుజా, నర్సింలు, నసీర్,అన్ను, అమ్ము, అలీతదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-సిర్గాపూర్

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిర్గాపూర్ ఎంపీడివో బ్రహ్మంకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ.. సిర్గాపూర్ మండల పరిధిలో ఉన్న 18 గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. మూడు నుంచి 9 నెలలుగా జీతాలు రాకపో వడంతో జీపీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి నెలనెలా వేతనాలను సక్రమంగా ఇవ్వాలన్నారు. జీతాలు రాకపోవడంతో పిల్లల చదువు కోసం, కుటుంబ పోషణ కోసం అప్పులు చేసి నానా అవస్థలు పడుతున్నారన్నారు. కాబట్టి పెండింగ్‌లో ఉన్న జీతాలు మరియు కాస్మోటిక్ సరుకులు వెంటనే ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వారి వేతనం రూ.18,000కు పెంచాలన్నారు. వారికి ఈఎస్ఐ - పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. వారసత్వ ఉద్యోగం కొనసాగించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనియెడల కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు లక్ష్మయ్య, రామయ్య, నర్సింలు, తుకారాం తదితరులు ఉన్నారు.

రైతులకు కొత్త రుణాలివ్వాలి



నవతెలంగాణ-కొండాపూర్

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా కొత్త రుణాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కే.రాజయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేసిన రైతు రుణాలకు.. ఎలాంటి షరతులు లేకుండా కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంకా మాఫీ కానీ రైతులకు వెంటనే రుణాలను మాఫీ చేయాలన్నారు. మండలంలోని ఎస్బీఐ తొగర్‌పల్లి బ్రాంచ్, ఏపీజీవీబీ అనంతసాగర్, తేర్పాల్, మల్క్యాపూర్ బ్రాంచ్ వారు రైతులకు మాఫీ అయినా.. కొత్త రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. వడ్డీ డబ్బులు చెల్లిస్తేనే కొత్త రుణాలను మంజూరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు వడ్డీతో సంబంధం లేకుండా కొత్త రుణాలను ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వం కూడా నేటికీ పంట పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. వెంటనే వాటిని ఇవ్వాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు కొత్త రుణాలను మంజూరు చేయాల డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) యకులు బాబురావు, రాజు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఝరాసంగం

ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన దాని ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్లను క్రమబద్ధీకరించి వారికి జీతాలు పెంచి ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్ల అధ్యక్షులు ఆర్ ఈశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్ల హామీలను నెరవేరుస్తున్నదని కోటి ఆశలతో ఎదురు చూస్తున్నామన్నారు. ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని తమ డిమాండ్లను కచ్చితంగా నెరవేరుస్తుందని ఆకాంక్షిస్తున్నామన్నారు.

రుణమాఫీ కానీ వారు ఆందోళన చెందొద్దు

నవతెలంగాణ-న్యాల్‌కల్

మొదటి, రెండో దశలోనూ రుణా మాఫీ జరగని రైతులు ఆందోళన చెందొద్దని.. అర్హులైన ప్రతీ ఒక్కరికీ రుణమాఫీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుణమాఫీ జరగని రైతులు ఏఈఓల వద్దకు వెళ్లి సంప్రదించాలన్నారు. ఆధార్ తప్పులు, లోన్‌లో పేరు తప్పులు, రేషన్ కార్డు లేకపోవడం వంటి వాటి వల్ల కూడా రుణమాఫీ జరగలేదన్నారు. కాబట్టి అలాంటి తప్పులు ఏమైనా ఉన్నాయో వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి పరిశీలించుకోవాలన్నారు. పూర్తి వివరాలతో ఏఈఓ సనిత్‌రెడ్డిని సంప్రదించాలని సూచించారు.

వాహనాలకు ఉచిత పాస్ ఇవ్వాలి

నవతెలంగాణ-మునిపల్లి



టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల సమీపంలో ఉన్న గ్రామాల వాహనా లకు ఉచిత పాస్ ఇవ్వాలని కంకోల్ టోల్ ప్లాజా మేనేజర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని జాతీయ రహదారీ పైన ఉన్న టోల్ ప్లాజా నుంచి ఇరవై కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారన్నారు. వారి దగ్గర నుంచి టోల్ వసూలు చేస్తున్నారని.. కాబట్టి 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వాహనదారులకు ఉచిత పాస్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిపల్లి మండలాధ్యక్షుడు ఉపేందర్, జిల్లా ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు అయ్యప్ప స్వామి, మండల ఉపాధ్యక్షులు నాగిశెట్టి, క్రిష్ణ మూర్తి జహీరాబాద్ నియోజకవర్గ బీజేపీ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-టేక్మాల్



పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడిని పొందాలని వ్యవసాయ అధికారి రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం మల్కాపూర్ గ్రామంలో పత్తి పంటను సందర్శించి రైతులకు పత్తి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పత్తి పంటపై పురుగు ఉధృతిని బట్టి పేను బంక ఆశించి ఉంటే థైయోమి థాక్సమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి, తెల్ల దోమ ఆశించి ఉంటే డై ఫెన్ థాయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమేసిఫెన్ 1 మి.లీ, లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాని తెలిపారు. అదేవిధంగా నీటిలో మునిగిన పంట త్వరగా కోలుకోవడానికి 19-19-19 లేదా 13-0-45 వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. నేల ద్వారా వ్యాపించే తెగులు అరికట్టడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ని లీటర్, నీటికి కలిపి మొక్క మొదలు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ పొలాలకు రోడ్లు బాగు చేయండి

- ప్రభుత్వానికి, అధికారులకు రైతుల వేడుకోలు

నవతెలంగాణ-కొల్చారం



వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను మరమ్మతులు చేపట్టి బాగుచేయాలని మండలంలోని పైతర గ్రామ రైతులు శుక్రవారం కోరారు. గత కొంత కాలంగా గ్రామ చివర నుండి నాగప్పకుంట మీదుగా మంజీరా నది వరకు వెళ్ళే దారి అధ్వాన్నంగా తయారైందని పేర్కొన్నారు. అవసరాల నిమిత్తం వ్యవసాయ పొలాలకు రైతులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వరినాట్లు, కలుపుల సమయంలో రోడ్డు దుస్థితిని చూసి కూలీలు సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎస్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా కొంత మేరకు నామమాత్రంగా మరమ్మతులు చేపట్టి మార్గమధ్యలో వదిలేసి బిల్లులు డ్రా చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను మరమ్మతులు చేపట్టి బాగుచేయాలని కోరారు.

వీధిలైట్లు అందజేసిన తారా విష్ణువర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-చిలిపిచేడ్



మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తారా విష్ణువర్ధన్ రెడ్డి చిట్కుల్ గ్రామానికి 80 వీధిలైట్లను శుక్రవారం పంచాయతీ కార్యదర్శి తిరుపతికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి సేవకుడిగా పనిచేస్తానని ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నారు. గ్రామానికి సేవ చేయాలనే దృక్పథంతో ముందుకు సాగుతున్నానని చిట్కుల్ గ్రామంలో మరింత సేవకు ముందడుగు వేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు అఖిల్, నాగరాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుతో ఎమ్మార్పీఎస్ సంబరాలు

నవతెలంగాణ-వెల్దుర్తి



సుప్రీంకోర్టు తీర్పుతో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాసాయిపేట యాదగిరి మాదిగ మాట్లాడారు గత 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల ఉపకులాల వర్గీకరణ కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ఆయాంలో సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ ఏడుగురు సభ్యుల తీర్మానం చేసి బిల్లు పాస్ చేయడం సంతోషమన్నారు ఈ కార్యక్రమంలో కొమ్ము సేకులు వెంకటేష్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



మాజీ సర్పంచ్‌లు తమ పెండింగ్ బిల్లును చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న మండల మాజీ సర్పంచులను ఎస్సై శంకర్ శుక్రవారం ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్లు అప్పులు చేసి పనులు చేశారని ఇప్పటికీ బిల్లులు పెండింగ్లో ఉండడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, మాజీ సర్పంచులు పేర్కొన్నారు. తమ సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు శంకర్ గౌడ్, విట్టల్ గౌడ్, ప్రకాష్, సాయమ్మ, ఆయా గ్రామాల సర్పంచులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నిజాంపేట



మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను, మహిళ సర్పంచ్ భర్తలను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ వద్ద నిరసన కార్యక్రమానికి సర్పంచుల పోరం ఇచ్చిన పిలుపు మేరకు మాజీ సర్పంచులు మహిళ సర్పంచుల భర్తలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిజాంపేట సర్పంచ్ భర్త లక్ష్మీనరసింలు, నందిగామ సర్పంచ్ భర్త రాజగోపాల్, జెడిచెరువు సర్పంచ్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి టీచర్ అంజమ్మ సేవలు ఆదర్శం

- పదవీ విరమణలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ స్వరూప రాణి, సూపర్వైజర్ వరలక్ష్మి

నవతెలంగాణ-వెల్దుర్తి



ఉద్యోగ సమయంలో ప్రజల మన్ననలు పొందాలని రామాయంపేట్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ స్వరూప రాణి అన్నారు. శుక్రవారం మండల పరిధి మన్నె వారి జలాల్పూర్ గ్రామంలో 35 ఏళ్ల పాటు అంగన్వాడి టీచర్‌గా గ్రామానికి ఎన్నో సేవలు అందించిన ఘనత అంగన్వాడి టీచర్ అంజమ్మకే దక్కిందన్నారు. వయస్సు మీరుతున్న క్రమంలో పని భారం ఉన్నప్పటికీ పిల్లలకు సేవలు చేస్తూ ప్రాజెక్టు ద్వారా అప్పజెప్పిన రికార్డులన్నీ పూర్తి చేస్తూ ఉన్నత అధికారుల మన్ననలు పొందారన్నారు. అనంతరం అంగన్వాడి టీచర్లతో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ అంగన్వాడి టీచర్ అంజమ్మ మాట్లాడారు, 1989 ఏడాది బాల బడి నుంచి రూ.125 వేతనంతో నేటి వరకు అంగన్వాడి కేంద్రంలో సేవలందిస్తూ గర్భిణీలకు బాలింతలకు చిన్న పిల్లలకు గ్రామానికి ఎనలేని సేవలు చేశానన్నారు. ఇన్ని రోజులు సేవ చేస్తూ పదవీ విరమణ పొందడం బాధగా ఉందన్నారు. తోటి అంగన్వాడి టీచర్లు మాట్లాడారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి మండల వ్యాప్తంగా ఉన్న 38 మంది అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం

- లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి
- న్యాయమూర్తి కే అనిత.

నవతెలంగాణ-నర్సాపూర్



విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడం అభినందనీయమని నర్సాపూర్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె అనిత అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని పి.ఎస్.రెడ్డి పాఠశాలలో 8.9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు అమెరికాలోని హార్మోనిక్ సింపోనీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గత 14 రోజులుగా మ్యూజిక్ , కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. అయితే ఈ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయమూర్తి అనిత హాజరై మాట్లాడారు విద్యార్థులకు చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఇటువంటి విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమం నిర్వహించడం పట్ల పి.ఎస్.రెడ్డి పాఠశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఆమె ఎంఈఓకు సూచించారు. అనంతరం హార్మోని మ్యూజిక్‌లో పాల్గొని గెలుపొందిన విద్యార్థినిలకు మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చ నాయక్, పాఠశాల చైర్మన్ నరసింహారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి, హార్మోని సింపోనీ ప్రాజెక్టు బృందం సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ భావితరాలకు స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ-టేక్మాల్



ఎస్సీ వర్గీకరణ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి మండల కన్వీనర్ ఎర్రోళ్ల సంజీవులు అన్నారు. శుక్రవారం పాల్వంచలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన, అనంతరం ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా మాదిగలు పోరాటాలు చేస్తూనే ఉన్నారని, సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడిన తమ కులాలను, గుర్తించి తమ భావితరాల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వర్గీకరణ చేపట్టాలని ఎన్నో ఏళ్లు ఎదురుచూసి, అలసిపోకుండా ఉద్యమాలు చేస్తూనే ఉన్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు ఊడిగం చేసి ఓటు బ్యాంకుగా చూశారు తప్ప, తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. మోడీ ప్రభుత్వం మాట ఇచ్చినట్లుగానే రిజర్వేషన్లను చట్టబద్ధత కల్పిస్తూ, సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ విజయం ప్రతి మాదిగలకు అంకితమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్, భూమయ్య యాదయ్య, పెంటయ్య, సామిల్, జోగు కిష్టయ్య, విట్టయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. పైతరకు శాపం

- ఇంచార్జీ కార్యదర్శితోనే కాలం వెళ్లదీస్తున్న అధికారులు
- స్పెషలాఫీసర్ల పాలనతో కుంటుపడుతున్న గ్రామాలు
- చెత్తా చెదారంతో కంపుకొడుతున్న పల్లెలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు







నవతెలంగాణ-కొల్చారం

వర్షాకాల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య లోపంతో కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు రోడ్లపైకి వచ్చే పరిస్థితులున్నాయి. మండలంలోని పైతర గ్రామపంచాయతీ పరిధిలో గత కొంత కాలంగా పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బదిలీపై వెళ్లడంతో కొల్చారం కార్యదర్శి అంజయ్యకు ఇంచార్జ్ బాధ్యతలు ఇచ్చారు. దీంతో రెండు గ్రామాల మధ్య దాదాపు 12 కిలోమీటర్ల దూర ప్రాంతాలు కావడంతో గ్రామాల పర్యవేక్షణ కొరవడింది. అదేవిధంగా వర్షాకాల నేపథ్యంలో గ్రామపంచాయతీల్లో సరిపడా కార్మికులు లేక పారిశుధ్య సేవలు లోపిస్తున్నాయి. పైతర గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోవడంతో దుర్వాసన విరజల్లుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి దయనీయంగా మారిందని చెప్పుకోవచ్చు. పారిశుధ్య లోపంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పైప్ లైన్ల లీకేజీతో త్రాగునీరు కలుషితం

గ్రామంలో ప్రధానంగా ఉన్న సమస్య త్రాగునీరు పైప్ లైన్లు అక్కడక్కడా లీకేజీలు కావడంతో త్రాగునీటిలో మురుగు నీరు కలుషితమవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రోడ్లపై చెత్తాచెదారం నిండిపోయి దుర్వాసనలు విరజల్లుతోంది. లీకేజీ పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టేందుకు గతంలో గుంతలు తీశారు. కానీ వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టక మార్గమధ్యలో వదిలేయడంతో అందులో మురుగు నీరు నిలుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వాటిని గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రెండు రోజుల్లో రెగ్యులర్ కార్యదర్శిని నియమిస్తాం

ఇంచార్జ్ ఎంపీడీవో కృష్ణవేణి



అన్ని గ్రామాల్లో రెగ్యులర్ గ్రామపంచాయతీ కార్యదర్శులే ఉన్నారు. పారిశుధ్య లోపం ఎక్కడ లోపించకుండా చర్యలు తీసుకుంటాం. గ్రామాల స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. పైతర గ్రామపంచాయతీకి మాత్రం కొల్చారం పంచాయతీ కార్యదర్శిని ఇంచార్జీగా నియమించాం. రెండు రోజుల్లో పైతర గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమిస్తాం.

ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తు గడువు పొడిగింపు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ 'ఇంటింటా ఇన్నోవేటర్ 2024' దరఖాస్తు గడువు పొడిగించినదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆగస్టు 10వ తేదిలోగా ఇంటింటా ఇన్నోవేటర్ 2024 కార్యక్రమం కోసం తమ ఎంట్రీలను సమర్పించాలని తెలిపారు. ఈ ఏడాది 6వ ఎడిషన్‌తో ముందుకు వచ్చిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ తెలంగాణాలో ఆవిష్కరణ వ్యవస్థాపకతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆవిష్కరణలను ఆగస్టు 15న ప్రదర్శించే అవకాశాన్ని అందిస్తుందన్నారు. గ్రామీణ తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్క ఆవిష్కర్తను ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆయన కోరారు. ఈ ఏడాది మరిన్ని ఔత్సాహిక ఆవిష్కర్తలకు సమగ్ర మద్దతు అందించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ సిద్ధంగా ఉందన్నారు. ఆవిష్కర్తలు వర్సప్ ద్వారా 9100678543కు దరఖాస్తులను సమర్పించాలన్నారు. పేరు, వయస్సు, ఫోటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణ గురించి 100, పదాల వివరణ, నాలుగు అధిక, రిజల్యూషన్ చిత్రాలు, రెండు వీడియోలు 2 నిమిషాలలోపు పంపాలని తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ

నవతెలంగాణ-పాపన్నపేట



సీజనల్ వ్యాధులు ప్రబలకుంట చూడాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. పాపన్నపేట మండలం గాంధారిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు, అనంతరం గ్రామ పరిసరాలను పాఠశాలను అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యాన్ని తదుపరి స్థాయికి తీసుకువెళ్లే చర్య దోమల వృద్ధి ప్రాంతాలను తొలగించి నియంత్రించడానికి, డెంగ్యూ వ్యాప్తిని నిరోధించడానికి సురక్షితమైన పారిశుధ్య పద్ధతులను ప్రోత్సహించడం, కొనసాగించడం తద్వారా పారిశుద్యం ప్రాముఖ్యతను తెలియజేస్తూ, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, జీపి, మండల స్థాయి ప్రభుత్వ అధికారులతో అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రచారంపై అవగాహన కల్పించామన్నారు. జిల్లా యంత్రాంగం అన్ని గ్రామపంచాయతీలలో నిర్వహించిన ఫ్రైడే- డ్రై డే కార్యకలాపంలో ప్రజలు భాగస్వామ్యం వహించారని చెప్పారు. ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో వుంచకుండా చూడాలని సూచించారు. కాలువలకు అడ్డంగా రాళ్లను పెట్టడం వల్ల నీరు నిల్వ వుంటుందని, వాటిని వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. శుక్రవారం డ్రై డే:-వ్యాధులను నియంత్రించడానికి, వెక్టర్ వ్యాధులను తొలగించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్రై-డే లక్ష్యం గురించి వివరిస్తూ, ప్రతి శుక్రవారం ఇంటి స్థాయిలో మూడు గంటల పాటు పాత్రలు, పాత్రలు, నీటి ట్యాంకులు ఖాళీ, డ్రైనేజీ, కాలువలలో చమురు, బాల్స్ వదలడం, నీటి వనరులను శుభ్రపరచడం ద్వారా ప్రజలను ప్రేరేపించడం ద్వారా దోమల పెంపకం, డెంగ్యూ వ్యాప్తిని నియంత్రించడం. జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లే ఎక్కువ ప్రమాదాలు

- మాదకద్రవ్యాల వలన యువత పక్కదోవ
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-వెల్దుర్తి



డ్రంక్ అండ్ డ్రైవ్ వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, దానివల్లనే కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక ఎస్సై నవత గౌడ్‌ను పోలీస్ స్టేషన్ వివరాలను క్రైమ్ రిపోర్ట్సను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వలన ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మాదక ద్రవ్యాల వలన యువత పక్కదారి పడుతున్నారన్నారు. మాదకద్రవ్యాలు సేవించి యువత మరణాలకు లోనవుతున్నారన్నారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్నారన్నారు. భూ తగాదాలు పెట్రేగిపోతున్నాయని వాటిని సామరస్యపూర్వకంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో తాళం వేసి ఇళ్లలో పలు దొంగతనాలు జరిగాయని దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందిస్తూ పెట్రోలింగ్ ద్వారా అరికట్టమని అన్నారు. దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను పట్టుకొని చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగా కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-వెల్దుర్తి





మండల పరిధిలోని మన్నె వారి జలాల్పూర్ గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం రెండవ రోజు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ రామాయంపేట్ ప్రాజెక్ట్ సీడీపీఓ స్వరూప రాణి హాజరై తల్లిపాలు విశిష్టతపై మాట్లాడారు. శిశు ఆరోగ్యంగా ఎదగడానికి ఎంతో అవసరమన్నారు. తల్లిపాలలో రోగ, నిరోధక శక్తి పెరిగి తల్లిపాలు సులభంగా జీర్ణం అవుతాయన్నారు. తల్లిపాలలో అన్ని రకాల కొవ్వు మాంసం కృతులు పోషకాలు మెండుగా ఉంటాయని రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.వారం రోజులపాటు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడి టీచర్లు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పెద్దశంకరంపేట

తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పెద్ద శంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై గర్భిణీలు బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిని వేద్రశ్రీ మాట్లాడుతూ పెద్ద శంకరంపేట మండల వ్యాప్తంగా ఆగస్టు ఒకటి నుంచి ఏడు వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిశువు జన్మించిన గంట నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు తల్లికి శిశువు ఆరోగ్యం ఉంటుందన్నారు. శిశువులకు ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు ఆహారాన్ని ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పలత మాట్లాడుతూ ప్రకృతి శిశువుకు ఇచ్చిన వరం తల్లిపాలన్నారు. తల్లిపాలలో శిశువు కావలసిన అన్ని పోషకాలు ఉంటాయని ఆహారంతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు భాగ్యమ్మ, పుష్పలత ఆరోగ్య సిబ్బంది. ఏఎన్ఎంలు అంగన్వాడీ టీచర్లు గర్భిణీలు పాల్గొన్నారు.

వికలాంగులకు స్వయం ఉపాధి కోసం శిక్షణ

- జిల్లాలోని ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్‌లలో 5 శాతం వికలాంగులకు కేటాయించాలి
- దేవస్థాన కమిటీలలో వికలాంగులకు అవకాశం కల్పించాలి
- మెదక్ జిల్లా 7వ మహాసభల్లో తీర్మానం

నవతెలంగాణ-మెదక్ టౌన్







జిల్లా కేంద్రంలో వికలాంగులకు స్వయం ఉపాధి కల్పన కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎన్‌పీఆర్‌డీ మెదక్ జిల్లా 7వ మహాసభ తీర్మానం చేసింది. శుక్రవారం నిర్వహించిన మహా సభల్లో జిల్లాలో వికలాంగులు ఎదురుకుంటున్న సమస్యలపై తీర్మానాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం నిర్మించిన షాపింగ్ కంప్లెక్స్‌లలో 5శాతం కేటాయించాలని కోరారు. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, షాపింగ్ కంప్లెక్స్‌లలో ర్యాంపులు నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏడుపాయల దేవస్థానం పరిధిలోని షాపింగ్ కంప్లెక్స్‌లలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దరఖాస్తు చేసిన వారికి పరికరాలు, వివాహ ప్రోత్సాహం వెంటనే మంజూరు చేయాలని కోరారు. సదరం స్లాట్ బుకింగ్ 200లకు పెంచాలని, 21 రకాల వైకాల్యలకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని, జిల్లా కేంద్రం వికలాంగుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ విద్యా సంస్థల్లో వికలాంగుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు. ప్రతి నెల 5వ తేదీ లోపు పెన్షన్ చెల్లించాలని, వికలాంగులకు ఈజీఎస్ పథకంలో జాబ్ కార్డు మంజూరు చేసి 150 రోజులు పని కల్పించాలిమని కోరారు. వికలాంగుల చట్టలపై ప్రభుత్వ అధికారులు, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో ఉన్నా పరిశ్రమల నుంచి సిఎస్ఆర్ నిధులు వసూలు చేసి వికలాంగులకు పరికరాలు పంపిణి చేయాలని కోరారు. ఏడుపాయల, చాకిరీమెట్ల, నాచారం, చిట్కూల్ దేవస్థానం కమిటీలో వికలాంగులకు అవకాశం కల్పించాలని తీర్మాణాలను మహాసభలో అమోదించడం జరిగిందన్నారు. వీటి సాధన కోసం జిల్లా వ్యాప్త ఉద్యమలు చేస్తామని హెచ్చరించారు. ఎన్‌పీఆర్‌డీ మెదక్ జిల్లా కమిటీ ఎన్నిక అధ్యక్షులుగా బస్వారాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గ, అధ్యక్షులు ముత్యాలు, ఉపాధ్యక్షులు ఆగమయ్య, కిష్టయ్య, టి యాదగిరి, శ్రీనివాస్, స్వరూప, కార్యదర్శి యశోద, సహాయ కార్యదర్శులు సంతోష్, చంద్రం, నాగరాజు, భాగ్యమ్మ, కోశాధికారి శ్రీనివాస్‌లతో పాటు మరో 18మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక అయ్యారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

- విజబుల్ పోలీసింగ్, సత్ప్రవర్తనతో ప్రజలలో నమ్మకం కలిగించాలి
- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-నార్సింగి




నార్సింగి పోలీస్ స్టేషన్‌ను మెదక్ జిల్లా ఎస్పీ డీ.ఉదయ్ కుమార్ రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట రాజు గౌడ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎస్పీకి స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ రికార్డులను పరిశీలించి కేసుల నమోదు, కేసుల స్థితి గతుల గురించి పరిశీలించారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్, స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఎఫ్ఐఆర్ లను నిష్పాక్షికంగా నమోదు చేయాలన్నారు. ఫిర్యాదు దారులకు పోలీస్ స్టేషన్ లో న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని కలిగించేలా పోలీసుల ప్రవర్తన ఉండాలన్నారు. డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించాలని క్షతగాత్రులకు వెంటనే ప్రథమ చికిత్స చేసి, దగ్గరి లోని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. విజబుల్ పోలీసింగ్‌తో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలన్నారు. నేర పరిశోధనలో ఇన్వెస్టిగేటివ్ అధికారి సాక్ష్యాధారాలను సేకరించడంలో మంచి నైపుణ్యంతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తో పాటు రామాయంపేట సీఐ వెంకట రాజు గౌడ్, స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్, ఏఎస్ఐ మాణిక్ ప్రభు, సిబ్బంది ఉన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

- రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్

నవతెలంగాణ-మనోహరాబాద్



పోటీతత్వంతో గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు స్వంత నిధులను పెట్టి గ్రామాలను అభివృద్ధి చేశారని, ఆ బిల్లులు రాక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతూ కూలీపనులు చేయాల్సిన దుస్థితి నెలకొందని ప్రభుత్వం వెంటనే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు, కాళ్ళాకల్ మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు అసెంబ్లీ ముందు ధర్నాకు వెళ్తున్న సర్పంచ్‌లను మనోహరాబాద్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు సర్పంచ్‌లుగా కొనసాగిన వారు తమ గ్రామ పంచాయతీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ పోటీతత్వంతో పనులను చేపట్టి అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా ఇతర గ్రామాలకంటే తమ గ్రామం ముందుగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో సర్పంచ్‌లు స్వంత నిధులను పెట్టి గ్రామాలను అభివృద్ధి చేశారని తెలిపారు. గ్రామాలలో వీధిలైట్ల ఏర్పాట్లు, మురుగు కాల్వల నిర్మాణాలు, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాలు, రైతు వేదికలు, మన ఊరు, మనబడి, పల్లె ప్రగతి, మిషన్ భగీరథ లాంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం నుంచి ఆలస్యమైనా తమ హయాంలోనే బిల్లులు వస్తాయనే ఆలోచనతో నిధులను ఖర్చు చేసి అభివృద్ధి చేశారన్నారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వంకు ఎన్ని సార్లు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పనులను చేపట్టి తెలంగాణలోని గ్రామపంచాయతీలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడంతో రాష్ట్ర నాయకత్వం ధర్నాకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఇలాంటి అక్రమ అరెస్టులు సరికాదని వెంటనే ప్రభుత్వం స్పందించి సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి వారి ఇబ్బందులను తీర్చాలని మల్లేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పోతారం సరంపంచ్ బడికోలు మాధవరెడ్డి, పర్కిబండ సర్పంచ్ పూల అర్జున్, కోనాయిపల్లి సర్పంచ్ బాషబోచిన ప్రభావతి నర్సింలు, దండుపల్లి సర్పంచ్ తనయుడు పంజా భిక్షపతి తదితరులు ఉన్నారు.

ఫలించిన 30 ఏళ్ల మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితం

నవతెలంగాణ-హవెలిఘనపూర్



ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని స్థాపించిన వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల పోరాట ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు అని మెదక్ మాజీ వైస్ ఎంపీపీ శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల ఏబీసీడీ వర్గాల ద్వారానే విద్యా ఉద్యోగ రంగాలలో మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం టపాకాయలు పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి మాదిగ సంఘం నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలు బాగుంటేనే మనం బాగుంటాం

- మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్



మన ఇంటి చుట్టూ పరిసరాలు బాగుంటేనే మనమందరం ఆరోగ్యంగా ఉంటామని హుస్నాబాద్ మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ 10వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పాత కుండాలలో, పాత డబ్బాలలో, పాత రంజాన్‌లలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తూ, సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మినీ ట్యాంకుల వద్ద, వాటర్ నిల్వ ఉన్న వద్దా, చిత్తడి ఉన్న ప్రదేశాలలో స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అనిత రెడ్డి , కౌన్సిలర్ గోవిందు రవి, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డ్ ఆఫీసర్ కల్యాణి, ఆర్పి పద్మ ఆశా వర్కర్,అంగన్వాడీ టీచర్, జవాన్లు సారయ్య, ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బత్తుల కిష్టయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



మృతుని కుటుంబానికి అండగా ఉంటామని మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్ర వారం మండలంలోని కాన్గల్ గ్రామంలో బత్తుల కిష్టయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మృతదేహానికి నివాళి అర్పించి వారి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కిష్టయ్య మరణం బాధా కరమన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సహ కారంతో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో చింతమడక శ్రీధర్, కరుణాకర్, బాలరాజు, పరశురాములు, రాజు, కనకరాజు తదితరులు ఉన్నారు.

ప్రయివేటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అందించాలి
- సీపీఐ(ఎం)చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలో ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అందించాలని సీపీఐ(ఎం)చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాళ్ల బండి నాగరాజు పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా, కనీసం పార్కింగ్ లేకుండా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలు బస్సులకు ఫిట్నెస్ లేకుండా నడుపుతున్నారని వాటి పట్ల విద్యాశాఖ, ఆర్టీవో అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు అందించే వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయని, కనీస వేతనాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. సెలవు రోజులు, రెండవ శనివారాలలో కూడా పెండింగ్ వర్క్ ఉందంటూ పెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని, పనికి తగ్గట్టుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులలో పాఠశాలలు నడుపుతే ప్రజా సంఘాలు,విద్యార్థి సంఘాల ను కూడగట్టి పాఠశాల ల ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఇప్పకాయల శోభ, పోలోజు శ్రీహరి, దర్శనం రమేష్, బోయిని మల్లేశం, రాళ్లబండి చందు, ఆముదాల రంజిత్ రెడ్డి, ఎర్ర బోస్ అశోక్ పాల్గొన్నారు.



గౌరవెల్లిని తాకనున్న గోదావరి

- మంత్రి పొన్నం చొరవతో ప్రత్యేక నిధులు
- రాజన్న మొదలెడితే పొన్నమన్న చేతిలో పూర్తి
- కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని నిరూపించిన పొన్నం
- నియోజకవర్గం అంతా పాలాభిషేకాలు



నవతెలంగాణ-అక్కన్నపేట

మెట్ట ప్రాంతమైనటువంటి హుస్నాబాద్‌ను సస్యశ్యామలం చేయాలని లక్ష్యంతో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్టుకు పునాది రాయివేశారు. ఆనాడే మొదలైన పనులు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పడుతూ లేస్తూ వచ్చాయి. దశాబ్ద కాలమైన రైతులకు నీరు అందకపోగా, నిర్వాసితులపై కూడా విపరీతమైనటువంటి లాఠీచార్జి చేశారు. అలా కేసీఆర్ పాలనలో చతికిల పడుతూ వచ్చిన ఈ ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై పడిందని చెప్పవచ్చు. అలా హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేదిగా మంత్రి పొన్నం ప్రభాకర్ అడుగులు కూడా పడుతున్నాయి. ఈ ప్రాజెక్టును రాబోవు కొన్ని రోజుల్లోనే పూర్తి చేసి రైతుల పొలాలను గోదావరి నీళ్ల తాకేలా పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారు. అలాంటి ఈ ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు చూద్దాం.

2007లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 1.15టీఎంసీల సామర్థ్యంతో శంకుస్థాపన చేసి 70శాతం పనులను పూర్తి చేశారు. అప్పుడే చాలామంది నిర్వాసితులకు పరిహారం కూడా చెల్లించారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రాజెక్టు చెరువుల ఉందని 8.28 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచేశారు. ఎప్పుడైతే ఈ ప్రాజెక్టు సామర్థ్యం పెరిగిందో, అప్పటినుంచి పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. పుష్కరకాలం ప్రాజెక్టు పనులు పూర్తికాక పోవడంతో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలంతా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తారని కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచేస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారించిన పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ నియోజకవర్గానికి తలమానికమైన గౌరవెల్లి ప్రాజెక్టును కొన్ని రోజులలోనే పూర్తి చేసేందుకు పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించారు. అంతేకాకుండా ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ:437కోట్లు కేటాయింపు కోసం కేబినెట్ ఇప్పటికే ఆమోదం తెలియచేసింది. అంతేకాకుండా రైట్ కెనాల్ లెఫ్ట్ కెనాల్ రీ ఎస్టిమేషన్ కోసం మంత్రుల సబ్ కమిటీ కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇందులో కుడి కాలువ ద్వారా 90 వేల ఎకరాలు ఎడమ కాలువ ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి చిగురుమామిడి, భీమదేవరపల్లి, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ధర్మసాగర్, ఘనపూర్ హనుమకొండ, జఫర్ ఘడ్, రగునాథపల్లి అలాగే కరీంనగర్ జిల్లాలను సైదాపూర్ చిగురుమామిడి మండలాలకు ఈ ప్రాజెక్టు నీళ్ళు అందుతాయి. అలాంటి ఈ మహెూత్తర ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ఇప్పటికే అన్ని విధాల కసరత్తులు చేస్తోంది. ఇదే తరుణంలో పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి పెట్టి రూ:437 కోట్ల కేటాయించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం నెలకొంది. హుస్నాబాద్ నియోజకవర్గం మొత్తం రైతులు నాయకులంతా మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకుంటున్నారు.



రైతుల ప్రభుత్వం కాంగ్రెస్:

కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతన్నల ప్రభుత్వం. ఇప్పటికే రైతుల రుణమాఫీ చేసి కళ్ళల్లో ఆనందం నింపింది. గౌరవెల్లి ప్రాజెక్టు కోసం రూ:437 కోట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేటాయించడం ఆనందదాయకం.

-జంగపెల్లి ఐలయ్య
అక్కన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు



గోదావరి నీళ్లతో హుస్నాబాద్ సస్యశ్యామలం

త్వరలోనే గోదావరి నీళ్ల హుస్నాబాద్‌ను ముద్దాడుతాయని, ఇదంతా కాంగ్రెస్ చొరవతోనే జరుగుతోంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు తెప్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నకు ప్రత్యేక ధన్యవాదాలు.

పాంద్రాల దాము
- అక్కన్నపేట యూత్ కాంగ్రెస్ నాయకులు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మక నిర్ణయం

- భాజపా నాయకుడు నల్ల నరేందర్

నవతెలంగాణ-ములుగు



సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో భాజపా నాయకుడు నల్ల నరేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అలాగే మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల ఎస్సీ, ఎస్టీ కుల వర్గీకరణ పోరాటానికి నరేంద్ర మోడీ నేతృత్వంలో సహకారం అయిందని భాజపా ఎవరికి శత్రువు కాదు ప్రతి భారతీయుడికి మిత్రువే అని అన్నారు. 2024లో భాజపా ప్రభుత్వం మూడవసారి ఏర్పడ్డాక వచ్చిన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పెద్ద చరిత్ర సృష్టించింది భాజపా పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మాదిగ కులస్తులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు స్వాగతిస్తూ సంబరాలు



నవతెలంగాణ-నంగునూరు: గత 30ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తూ మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటంలో ఆగస్టు ఒకటో తారీఖు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కృష్ణ మాదిగ విజయమని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలియజేశారు. శుక్రవారం నంగునూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించి సంబరాలు చేసుకున్నారు. నంగునూరు మండలంలోని డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు, కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎనగందుల యాదగిరి మాదిగ మాట్లాడుతూ మాదిగ ఉప కులాలకు వర్గీకరణ సాధనగా కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేవులపల్లి రాజమౌళి మాదిగ, దేవులపల్లి నర్సింగరావు మాదిగ, దేవులపల్లి కిష్టయ్య మాదిగ, మండల ఇంచార్జి ఆరెపల్లి కనకయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాల ఆవశ్యకతను వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గుడ్లు, బాలామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు,అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆయాలు, గర్భిణీలు, మహిళలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం విజయవంతం చేయాలి

- ఎంపీడీఓ బి.యాదగిరి

నవతెలంగాణ- జగదేవ్‌పూర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామాల్లో పటిష్టంగా అమలుపరిచి విజయవంతం చేయాలని జగదేవ్‌పూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శిలతో స్వచ్ఛ దనం- పచ్చదనం కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయాలని ఉద్దేశ్యంతో ఈ నెల 5 నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టనుందని. ప్రతి గ్రామం పారిశుధ్యంతో స్వచ్ఛదనం మొక్కలు నాటడంతో పచ్చదనం సంతరించుకుని గ్రామాల రూపు రేఖలు మారేలా గ్రామ స్థాయి అధికారులు నాయకుల, ప్రజల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న గ్రామాల్లో నీ స్వయం సహాయక సంఘాల మహిళలతో, యువతతో సమావేశము నిర్వహించి వారితో గ్రామాల్లో ర్యాలీలు చేపట్టాలన్నారు. ఈ నెల 6న ప్రతీ గ్రామంలో ఉన్న త్రాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినైజేశన్ చేపట్టాలని, 7న రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే కార్యక్రమం, 8న వైద్యాధికారులతో కలసి డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడకుండా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని, 9న ప్రభుత్వ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించాలని, అదేవిదంగా వన మహెూత్సవం లో భాగంగా మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో పటిష్టంగా అమలు చేసి స్వచ్ఛదనం .. పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్య క్రమం లో ఉప తహసీల్దార్ రఘు వీరా రెడ్డి, సుపరిడెంట్ ఆంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ యాదయ్య, వివిధ గ్రామాల ప్రత్యేక అధికారులు,పంచాయతీ కార్యదర్శులు హరీశ్, సాయి బాబా పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

నవతెలంగాణ-గజ్వేల్



సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటిమిక్ సెల్ గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్ కుమార్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో ముట్రాజ్‌పల్లిలో ఇంటింటికి తిరుగుతూ దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. డ్రై డే, ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా ముట్రాజ్‌పల్లిలోని దళితవాడ్లలో అంగన్వాడీ సెంటర్, బీసీ కాలనీ ఆరోగ్యపక్షం వరకు వర్షాకాలంలో వచ్చే సీజన్లు వ్యాధుల పట్ల జాగ్రత్త ఉండాలని ఇంటింటికి తిరుగుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలు శుభ్రం చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు. చిన్న దోమలు లేకదా అని లైట్‌గా తీసుకుంటే పెద్ద పెను ప్రమాదం పొంచి ఉంటుందని చెప్పారు. విష జ్వరాలు, కలరా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యం పరిశుభ్రత మన చేతుల్లో ఉంటుందని అన్నారు. అంతేకాకుండా మున్సిపాలిటీలోని 17వ వార్డులో ముక్తసపల్లిలో ఇంటింటికి తిరుగుతూ ఫీవర్ సర్వే చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సభ్యులు దేవసాని వాసుదేవ్, నాగరాజు, ఏఎన్ఎం ఉమా, ఆశ వర్కర్లు, మహేశ్వరి, రేణుక, అంగన్వాడీ టీచర్లు కవిత, పద్మ, మున్సిపల్ సిబ్బంది వెంకటయ్య, సత్తయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి



నవతెలంగాణ-గజ్వేల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకొని ముందుకు సాగాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో ఇంటింటికి తిరుగు తూ తన ఇంటిలో కూడా పరిశుభ్రత లో భాగంగా డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు నివసించే పరిసరాల ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉంటేనే దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు ఉంటుందని తెలిపారు. మన ఇంటి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రత చేసుకోవాలని సూచించారు. అన్ని ప్రాంతాలను మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత చేయాలంటే సాధ్యం కాదని ప్రజల సహకారం ఉంటేనే ఏదైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి వ్యక్తిగత శుభ్రంతో పాటు ఇంటిలో నిలవకుండా నీటి తొట్లను తొలగించి మంచినీరును తిరిగి మొక్కలకు వేయాలని కోరారు. ప్రతి ఇంటిలో ఉన్న పూల మొక్కల చుట్టూ శుభ్రం చేయాలని తొట్లలో ఏర్పాటు చేసిన మొక్కల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. నీరు నిలిస్తే వర్షాకాలం అయినందున దోమలు ఈగలు, ఇతర కీటకాలు నిలువగా ఉంటాయని చెప్పారు. దీనివల్లనే డెంగ్యూ జరాలు ఇతర సీజన్ వ్యాధిలో వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు

- వంగ భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాల పెండింగ్ బిల్లులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రాష్ట్ర మాజీ సర్పంచుల ఫోరం పిలుపుమేరకు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సెక్రటేరియట్ ముట్టడికి తరలి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు శుక్రవారం ముందస్తు అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటు అని మద్దూరు సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు వంగ భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లు విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. సర్పంచ్లుగా ఎన్నికై అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచుల పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమ్మ ఆదర్శ కమిటీలు వేసి పాఠశాలలో పనులు చేయించి వారికి ముందస్తుగా బిల్లులు చెల్లించాలని తెలిపారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాలలో పనులు చేస్తే ఇప్పటి వరకు బిల్లులు రాలేదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా అక్రమ అరెస్టులు మాని పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ధర్మారం, లద్నూర్, మాజీ సర్పంచులు ఊట్ల రవీందర్ రెడ్డి, జీడీ కంటి సుదర్శన్‌లు ఉన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

- అలుపెరుగని యోధుడు మందకృష్ణ మాదిగ
- మూడు దశబ్దాల పోరాట కల సాకారం..
- ఎమ్‌జేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల కేంద్రంలో గల అంబెద్కర్ చౌరస్తాలో శుక్రవారం ఏబీసీడీ వర్గీకరణ సాదించిన సందర్భంగా ఎమ్ జే ఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గర్జకుంట రామస్వామి ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముందుగ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి తదనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాబిషేకం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ముందుగా సుప్రీంకోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సారథ్యంలో మూడు దశాబ్దాల పాటు సాగిన పోరాటం సాకారమైంది అని తెలిపారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు తీర్పు ఇవ్వడానికి మందకృష్ణ మాదిగ కృషి మరువలేనిది అన్నారు. ఆయన పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు అని అన్నారు. రాబోయే రోజుల్లో మాదిగ జాతికి, ఎస్సీ ఉపకులాలకు మంచి రోజులు రాబోతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఎస్సీ ఉపకులాలు అన్ని కూడా అభివృద్ధికి ఈ తీర్పు ఎంతో ఉపగోపాడుతుంది అని అన్నారు. మందకృష్ణ మాదిగ చేసే ఏ పోరాటం అయిన ఒక మాదిగ జాతికి మాత్రమే కాదు, అన్ని కులాకు ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎమ్‌జేఎఫ్ ఉపాధ్యక్షులు ఎం జాంగిర్, జి. శివదాసు, నాయకులు భాస్కర్, ఎమ్‌జేఎఫ్ నియోజకవర్గ నాయకులు రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మాసపాక యాదగిరి నియోజకవర్గ నాయకులు మచ్చ బాబు, సుధాకర్, ప్రశాంత్ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఆకారం నర్సింలు, ఆకారం పెద నర్సింలు, ముక్కెర నాగరాజు, ముక్కెర ఇస్తారి తిరుమలపురం తిరుపతి, ఈరమైన మైసయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

పొన్నం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలంలోని అంతకపేట, రామవరం గ్రామాల్లో పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి శుక్రవారం పాలాబిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, అక్కన్నపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య హాజరై మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడం కోసం నిధులు కేటాయించడం ఆనందాయకమని అన్నారు. త్వరలోనే గోదావరి జలాలు హుస్నాబాద్ నియోజకవర్గంలోని రైతులందరికీ అందుతాయని తెలియజేశారు. కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులతో కాంగ్రెస్ దూసుకుపోతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్ గౌడ్, అంతకపేట గ్రామ శాఖ అధ్యక్షులు కాశబోయిన రవి, రామవరం గ్రామ శాఖ అధ్యక్షులు రికల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ వనపర్తి నరేష్, ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగాల కనకయ్య, మాజీ ఉప సర్పంచ్ శేరి కనకయ్య, సీపీఐ గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, అక్కన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బొమ్మ నవీన్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంగ రాకేష్, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్, లింగాల ఉపేందర్, లింగాల సంతోష్, మహమ్మద్ బషీరుద్దీన్, లింగాల సంపత్, శైలేంద్ర రాజు, బండి శ్రీనివాస్, రామంచ హనుమంతు రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కల పంపిణీ



నవతెలంగాణ-చేర్యాల: వన మహెూత్సవం సందర్భంగా చేర్యాల మున్సిపాలిటీ ద్వారా పట్టణంలోని నాల్గో వార్డులో శుక్రవారం ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. అనంతరం డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా చేర్యాల పట్టణంలోని అన్ని వార్డులలో మున్సిపల్ పాలకవర్గం, వార్డు ఆఫీసర్లు, ప్రజలు డ్రై డే ఫ్రైడే నిర్వహించి మురికి కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జె. ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నాం

- జాతీయ మాల మహానాడు పోలీట్ బ్యూరో చైర్మెన్ ర్యాకం శ్రీరాములు

నవతెలంగాణ-రాయపోల్



ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఉద్యోగ నోటిఫికేషన్‌లలో వర్గీకరణ అమలకు ఆర్డినెన్స్ జారీ చేస్తామని ప్రకటించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని జాతీయ మాల మహానాడు పోలీట్ బ్యూరో చైర్మెన్ ర్యాకం శ్రీరాములు అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర సాంస్కృతిక విభాగం చైర్మెన్ ఎలుక దేవయ్యలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల ప్రచారంలో భాగంగా మందకృష్ణ మాదిగకు ఇచ్చిన హామీ మేరకు సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి వర్గీకరణకు అనుకూలంగా తీర్పును వెలువరించే విధంగా బీజేపీ ఆలోచనను తప్పుపడుతున్నామన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేస్తామన్నారు. ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వ హక్కు, ఆర్టికల్ 341 షెడ్యూల్ కులాల ఐక్యమత్యానికి విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పును భావించాల్సి వస్తుందన్నారు. దేశంలో ఐక్యంగా ఉన్న ఎస్సీలను వర్గీకరణ పేరుతో విడదీయడం కోసమే ఈ తీర్పు వర్తిస్తుందన్నారు. దళిత బహుజనలు కులాలు, ఉప కులాలుగా విడిపోతే రాజ్యాధికారం అసలు లక్ష్యాన్ని సాధించలేమన్నారు. దేశంలో 85 శాతం జనాభా ఉన్న దళిత బహుజనలు ఏకమైతేనే రాజ్యాధికారం సాధిస్తామన్నారు. ఎస్సీ జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుందని ప్రతి రాష్ట్రంలో జనాభాలో వ్యత్యాసం ఉంటుందని రిజర్వేషన్ ఎలా అమలు చేస్తారన్నారు. గత 30 ఏళ్లుగా వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత బహుజన ప్రజాసంఘాలు పోరాటం చేస్తున్నాయని, మాలలలో ఐక్యమత్యం లేకనే ఈరోజు వర్గీకరణ అనుకూల తీర్పు వచ్చిందన్నారు.ఇకనైనా మాల, మాల ఉపకులాల ప్రజలు మేల్కొని వర్గీకరణకు వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు రాజకీయ పదవులు పొంది జాతితో సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్న మాల జాతి చెందిన ప్రజలు మేలుకోవాలన్నారు. ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రిజర్వేషన్ ఫలాలతో అభివృద్ధి చెంది జాతిని మర్చిపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ చెప్పిన పే బ్యాక్ సొసైటీ మాల ప్రభుత్వ ఉద్యోగులు సహకారం అందించాలన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించే హలో మాల ఛలో ఢిల్లీ చైతన్య దీక్షలను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు దామోదర నర్సయ్య, జక్కుల రాజు, వెన్న రాజు, ఎలుక పోచయ్య పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా పదోన్నతులు

- కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ- గజ్వేల్





విద్యాశాఖ చరిత్రలోనే ఇంత పెద్ద పదోన్నతులు గతంలో ఎన్నడూ జరగలేదని ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని చెప్పారు. 30 వేల మంది ఉపాధ్యాయుల మిత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్బీ స్టేడియంలో బేటి కావడం తెలంగాణ చరిత్రలోనే నిలిచిపోతుందని అన్నారు. ఉపాధ్యాయులు కొన్ని ఏళ్లుగా బదిలీ లేక ఇబ్బందులు గురవుతున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయు కుటుంబాల్లో సంతోషం నెలకొన్నదని చెప్పారు. అంతకుముందు గజ్వేల్ పట్టణం నుంచి హైదరాబాదుకు ప్రత్యేక బస్సుల ద్వారా ఉపాధ్యాయులను సాగనంపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్, సర్దార్ ఖాన్, పట్టణ అధ్యక్షులు రాజు, నక్క రాములు గౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బలరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం గజ్వేల్ పట్టణ అధ్యక్షులు రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

ఛలో సెక్రటేరియట్‌కు తరలిన మాజీ సర్పంచులు

నవతెలంగాణ-నంగునూరు



మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం విజయవంతమైందని మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ తెలిపారు. శుక్రవారం నంగునూరు మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు హైదరాబాద్ కు తరలి వెళ్లారు. సెక్రటేరియట్ ముట్టడించడంతో పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచుల బిల్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వము గాంధీ మార్గంలో అడుగుతే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులు మమ్మల్ని అరెస్టు చేయడం చాలా సిగ్గుచేటన్నారు.

తక్షణమే కుల గణన షెడ్యూలు ప్రకటించాలి



- బీసీ సంఘం నేతలు

నవతెలంగాణ- గజ్వేల్

తక్షణమే కుల గణన షెడ్యూలు ప్రకటించాలని సిద్దిపేట జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొమ్ము ఉమేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ డెకరేషన్‌లో శిలాసాసనాలు అనే పేరు ప్రకటించినట్లు తక్షణమే కులగణను చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం దాటవేస్తుందని అన్నారు. దీని నిరసిస్తూ నిరసన దీక్షలు చేపడతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగల అంశాన్ని హేళన చేసే విధంగా కులాలు లేని వారే కులగణన అంశం కోరుతున్నారని వాక్యాలను నిరసిస్తున్నమన్నారు. శనివారం నుంచి జిల్లా కేంద్రాల్లో నిరసనకు రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. బీసీ రిజర్వేషన్లు నెలపరం శాతం అన్ని రంగాల్లో అమలుకై చెల్లెలు తొమ్మిదిలో పెట్టి పార్లమెంటులో ఆమోదింప చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆకారం రాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము రాజు యాదవ్, గజ్వేల్ మండలం నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

పౌష్టికాహారంతోనే చిన్నారుల ఎదుగుదల

నవతెలంగాణ-కోహెడ



పౌష్టికాహారం తీసుకోవడం వలననే చిన్నారులలో మానసిక ఎదుగుదల చేకూరుతుందని ఎంఎల్‌హెచ్‌పీ హరీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుంటపల్లి, రాంచంద్రాపూర్ గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 24 నెలలలోపు చిన్నారుల గృహాలను సందర్శించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం బిడ్డ ఎదుగుదలకు సహాకరిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం స్వరూప, అంగన్‌వాడీ టీచర్‌లు శెట్టి రమాదేవి, స్వరూప, పద్మ ఆశా కార్యకర్తలు లింగవ్వ, భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

జిల్లాలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. ఆగస్టు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)తో కలిసి పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, అర్డబ్ల్యూఎస్, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతి కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం పేరిట పారిశుధ్యం, వైద్య సేవలు, మంచినీటి ట్యాంకులు క్లీనింగ్ చేయుట, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయుట, పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలు నాటడం, జ్వర నియంత్రణ చర్యలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీజన్ వ్యాధులు ప్రబలే కాలమని అందువల్ల పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టేందుకు ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహణకు గ్రామ, మున్సిపల్ వార్డుల స్థాయిలో టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు.

5వ తేదీన: గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, మహిళా సంఘాలు, యువత, ప్రముఖులతో కార్యక్రమం నిర్వహణ యొక్క ప్రాధాన్యతను తెలియచేయుటకు పెద్ద ఎత్తునఅవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరించుట, అట్టి వ్యర్థాలతో వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేయాలని తెలిపారు. పారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విద్యార్థులులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపరచాలని స్పష్టం చేశారు. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలని తెలిపారు. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి మరుగుదొడ్లు మంజూరు చేయాలని అన్నారు.

6వ తేది రెండోరోజు: తాగునీటి ట్యాంకులు శుభ్రపరచుట, క్లోరినేషన్ నిర్వహించేలా చైతన్యపరచాలని, క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. మంచినీటి. పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించి, ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి చెరువులు, కుంటలు కలుషితం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

7వ తేదిన: మురుగుకాల్వలు పూడిక తీయుట, వర్షపు, మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల్లోకి మళ్లించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చి రోలింగ్ చేయాలన్నారు. తాగునీటి చేతిపంపులు, మురుగుకాల్వల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

8వ తేది నాలుగో రోజు: వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాదులు డెంగీ, మలేరియా, డయేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలని, జ్వరంతో బాధపడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్, గంభూషియా చేపలు వేయాలన్నారు.మున్సిపల్ పరిధిలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ వినియోగంలోకి తేవాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. వీధి కుక్కలు సంచరించే ప్రాంతాలను గుర్తించి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో కుని శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు మున్సిపల్ కమిషనర్, పశు సంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో ఏబీసీ కేంద్రాలకు తరలించాలన్నారు.

9వ తేదీన చివరి రోజు నిర్వహించాల్సిన కార్యక్రమాలు: శుక్రవారం డ్రై డేలుగా పాటించుటపై అవగాహన కల్పించాలని అన్నారు. పంచాయతి, మున్సిపల్ వార్డుల్లోశిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఈ ఐదు రోజులలో ఎప్పుడైనా వనమోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తొలగించి, అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టి మొక్కలు నాటాలని, కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇన్స్టిట్యూషనల్ ప్లాంటేషన్, ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి ఇంటి పరిసరాల్లో నాటేలా చూడాలని, తెలిపారు.ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహణ నివేదికలు అందచేయాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టక ముందు చేపట్టిన తరువాత వచ్చిన మార్పుపై డాక్యుమెంట్ తయారు చేయాలని సూచించారు. స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమ లక్ష్యాలను సాధించుటకు గ్రామాలు, పట్టణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ వార్డు టీముల బృందం గ్రామస్థాయి, మున్సిపల్ వార్డు స్థాయిలో కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం విజయవంత మవుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు.మండల, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, వార్డు ప్రత్యేక అధికారులు కార్యక్రమాలను నిరంతరాయంగా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ఆదేశించారు. ఈ సమావేశంలో డీపీఓ దేవకీదేవి, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, అన్ని మండలాల మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంపీవోలు, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

-బీఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి

నవతెలంగాణ - కొమురవెల్లి



విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొంగు రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో చేసిన సేవలే శాశ్వతంగా గుర్తుండిపోతాయన్నారు. సేవా కార్యక్రమాలు చేయాలన్న లక్ష్యంతో తన తాత పేరిట బీఆర్ఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎస్సై అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతు నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి

-పంట పొలాల్లో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానన్న హామీ అమలు చేసిన రైతు నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ మండలంలో వంగరామయ్యపల్లిలో రైతులు రైతు కూలీలు కాంగ్రెస్ నాయకులు పంట పొలాలలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బంక చందు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏకకాలంలో రైతు రుణమాఫీ చేశారని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతు గుండెల్లో నిలిచిపోయారన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు నిన్న బడ్జెట్లో రూ .437 కోట్లు నిధులు కేటాయించినందుకు రైతులు ఆనందంతో ఉన్నారన్నారు. ఈ ప్రాంత ప్రజల యొక్క బాధలు తెలుసుకున్న నాయకుడై గౌరవెల్లి ప్రాజెక్టుకు ఫౌండేషన్ వేస్తే ఈరోజు రైతు బిడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్ పనుల ప్రారంభానికి నిధులు తీసుకువచ్చారన్నారు. రైతు అభిజ్ఞాత కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందని రైతు రుణమాఫీ చేయడంపై రైతులు కృతజ్ఞతలు తెలిపారు .

నవతెలంగాణ - సిద్దిపేట



అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉందని, ఎన్ఎస్‌యు ఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్, నియోజకవర్గ అధ్యక్షులు రాకేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం వల్ల నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రణాళిక ప్రకారం చదువుకోవడానికి, ఉద్యోగాలకు సిద్ధం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొహమ్మద్ సాజిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన నిర్వాసితులు రాగి శీను

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ ప్రాజెక్టుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం ద్వారా రూ.437 కోట్ల నిధులు కేటాయించడం పట్ల నిర్వాసితుడు రాగి శ్రీనివాస్ యాదవ్ హర్షం వ్యక్తం చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ప్రాజెక్టును విస్మరించారని, మాలాంటి నిర్వాసితులకు బేడీలు వేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. పరిహారం ఇవ్వకుండా అర్ధరాత్రి ఇండ్లు ఖాళీ చేయించేందుకు లారీ చార్జి చేశారని తెలియజేశారు. నిర్వాసితుల పాపం తగిలి కేసీఆర్ పతనం అయ్యాడని అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఇప్పటికి చాలామంది నిర్వాసితులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారని, దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

ప్రయివేటులో కూడా రిజర్వేషన్ అమలు చేయాలి

నవతెలంగాణ -నంగునూరు

ప్రయివేటు రంగాలలో కూడా రిజర్వేషన్ అమలు జరగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సుందు నర్సింలు డిమాండ్ చేశారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును ఇచ్చిన సందర్భంగా మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మాట్లాడుతూ ఈ ఏబీసీడీ వర్గీకరణ చట్టాన్ని ప్రయివేటు రంగాలలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ కులాల వర్గీకరణకు భారతదేశంలోనే అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు నిచ్చారని చెప్పారు. ఈ విజయం పూర్తిగా మందకృష్ణ మాదిగదే అన్నారు.

మహిళా శక్తి డైరీ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

నవతెలంగాణ-మద్దూరు



మహిళా శక్తి డైరీ యూనిట్ లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో పశు వైద్య అధికారి డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు డైరీ ఏర్పాట్లు ముఖ్యంగా మూడు రకాల పశువుల గురించి చెప్పానని తెలిపారు. ముర్రా గేదజాతి, జెర్సీ హెూలీ స్టేన్ ప్రెషర్, ఆవు జాతి పశువుల, గూర్చి మహిళలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ పరువయ్య నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వచ్చిన ప్రిన్సిపాల్‌కు ఘనంగా సన్మానం

నవతెలంగాణ -గజ్వేల్



ఇంటర్మీడియట్ విద్యాశాఖలో జరిపిన బదిలీలలో భాగంగా స్థానిక బాలుర జూనియర్ కళాశాలకు బదిలీ పై వచ్చిన ప్రిన్సిపాల శ్రీనివాస్ గౌడ్‌కు ఘనంగా సన్మానించారు. శుక్రవారం బాలల జూనియర్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. అయితే గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వాసవి, విద్యాసాగర్ బదిలీ స్థానంలో ఇక్కడికి శ్రీనివాస్ గౌడ్ బదిలీపై వచ్చారు. కళాశాల అధ్యాపకులు సాధారణంగా ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రకాష్, రాజిరెడ్డి, వెంకటరమణ, అష్రాఫ్, హాసిమ్, మాధురి, జ్యోతి, గంగా లక్ష్మీ, మల్లేశం, నరేష్ రెడ్డి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాతూరులో ఘనంగా పీర్ల పండుగ

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాతూరు గ్రామంలో పీర్ల పండుగ వేడుకల్లో గ్రామ పెద్ద ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మొహర్రం పండుగను హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసి మెలిసి చేసుకున్నారు. ఆనవాయితీగా సంప్రదాయబదంగా పీర్లను గ్రామంలోని ప్రధాన కూడళ్లలో ఊరేగిస్తూ ఇంటింటికి వెళ్లి ఊదును, బెల్లం దట్టీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం, హిందూ, సోదరులు, గ్రామ పెద్దలు, యువత, తదితరులున్నారు.

కార్మిక, కర్షక, పేద ప్రజల గుండెచప్పుడు "నవతెలంగాణ"

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి



నవతెలంగాణ -గజ్వేల్

ప్రజల ఐక్యతకు కృషి చేస్తూ కార్మిక, కర్షక, పేద ప్రజల గుండెచప్పుడుగా సమసమాజ నిర్మాణంలో నవతెలంగాణ పత్రిక ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకుని తొమ్మిదవ వసంతంలోకి అడుగుపెడుతూ, అనునిత్యం సంఘటిత, అసంఘటిత కార్మికుల, పేద ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ వారి సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నుముకగా ఉన్న అన్నదాతలకు వ్యవసాయ రంగానికి నష్టం చేసే వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం తెచ్చినప్పుడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులకు అవగాహన కల్పించి కార్మిక, కర్షక ఐక్యతను చాటి చెబుతూ నవ తెలంగాణ ముందుకు వెళ్ళిందన్నారు. ఢిల్లీలో రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో రైతులకు అండగా ఉంటూ పార్లమెంటులో చట్టాలను ఉపసంహరించుకోవడంలో రైతుల ఉద్యమం జయప్రదం కావడంలో నవ తెలంగాణ పాత్ర వెలకట్ట లేదన్నారు.ప్రజా మనుగడకు ప్రకృతిలో పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత పై అనేక కథనాలు రాస్తూ ప్రభుత్వాలకు పరిష్కార మార్గాలు చూపిస్తూ ప్రజలలో చైతన్యము నింపుతున్న కర దీపిక నవతెలంగాణ పత్రిక అన్నారు. కార్మికులకు, రైతులకు, ఉద్యోగులకు, ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వారికి వెన్నంటూ ఉంటూ వారి ఆలోచనలను, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో వారధిగా నవ తెలంగాణ ముందు ఉందన్నారు. సిద్దిపేట జిల్లాలోని కొండ పోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ రంగనాయక సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధిత ప్రజల పక్షాన వారి ఆవేదనలను అక్షర రూపంలో ప్రతిబింబించి న్యాయం కోసం కృషి చేస్తున్న పత్రిక నవ తెలంగాణ. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటూ "సమ సమాజ నిర్మాణం"లో ప్రత్యేక పాత్ర పోషిస్తున్న నవ తెలంగాణకు వందనం ఉద్యమాభివందనం అన్నారు. భవిష్యత్తులోను నవ తెలంగాణ అక్షర ప్రయాణం మెరుగైన సమాజ నిర్మాణం కోసం తోడ్పాటునందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ముందుకు సాగాలని కోరుతూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- సీఐ శ్రీను

నవతెలంగాణ-సిద్దిపేట రూరల్



చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాల, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించారన్నారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలు మన తప్పిదాల వల్లే జరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దు, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించేటప్పుడు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి అని సూచించారు. ఫైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. మీ బంధువులు కానీ ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీమ్ మహిళలకు ప్రత్యేక చట్టాలు, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు మొదలైన వాటిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100, లేక సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో స్కూల్ స్పెషల్ అధికారి కవిత, అధ్యాపకులు, సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్ఐ, మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట ఓయూ పీజీ కాలేజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, హాస్టల్ విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు కాలేజీ ముందు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగుతున్న పీజీ కాలేజీ హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాలేజీకి అనుబంధంగా నిర్మించిన బాలుర, బాలికల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు గదులు కేటాయించి భోజనం అందించడం లేదని మండిపడ్డారు. సుమారు 160 మంది హాస్టల్ విద్యార్థులు సొంతంగ డబ్బులు ఖర్చు చేసి వండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలుర, బాలికల హాస్టళ్లలో వార్డెన్స్, వాచ్ మెన్స్ దిక్కులేరని మండిపడ్డారు. రాత్రి వేళల్లో తాగుబోతులకు కాలేజీ, హాస్టల్ మైదానాలు అడ్డాగా మారాయని, ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తక్షణమే ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సిద్దిపేట పీజీ కాలేజ్ సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కొంపెల్లి విజయ్ కుమార్, కృపాకర్, గోపాల్, వేణు, రమేష్ , సందీప్, నిరంజన్, నవీన్, అనిల్, నాగరాజు, మహేష్, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ - సిద్దిపేట



డీలక్స్ బస్సులలో ప్రయాణించినందుకు గాను మహిళల కోసం ఏర్పాటు చేసిన లక్కీ డీప్‌లో విజేతలకు బహుమ తులు అందించినట్లు బస్సు డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం లక్కీ డిప్‌లో పేర్లు వచ్చిన మహిళా ప్రయాణికులకు గిఫ్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాలో విజేతలుగా ఎంపికైన అద్విక, సౌమ్య, పుష్పలకు గిఫ్టులు అందించినట్లు తెలిపారు. మహిళ లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బావి స్టార్టర్ దొంగిలించిన గుర్తు తెలియని వ్యక్తులు

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం కుందన్ వానిపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి సారయ్య అనే రైతు వ్యవసాయ బావికి సంబంధించినటువంటి ఫ్యూజులు, స్టార్టర్ గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని సారయ్య విలేకరులతో శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంకాలం వరి పొలానికి నీళ్లు పెట్టి ఇంటికి వచ్చానని, శుక్రవారం మధ్యాహ్న సమయంలో బావి దగ్గరికి వెళ్లేసరికి ఫ్యూజులు, కరెంటు స్టార్టర్ కనిపించలేదని అన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ప్రకటనపై హర్షం



నవతెలంగాణ-కోహెడ

ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అంటూ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉందని, సుప్రీంకోర్టు కోర్టు ప్రకటన పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్ఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, మాజీ జెడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ మంద ధర్మయ్యలు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల నుంచి ఎన్నో రకాల పోరాటాల ఫలితమే సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేల్పుల జయ్‌శంకర్, అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు మంద మల్లేశం, వేల్పుల సంపత్, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వలస సుభాష్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల జాన్, యూత్ అధ్యక్షుడు కొంకటి జితేందర్, మాజీ వార్డు సభ్యులు ర్యాగటి బాబు, గుండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, అవుల మహేందర్, పొన్నాల స్వామి, మాలోతు సీతారాం నాయక్, రాచూరి మల్లేశం, మాలోతు మోతిరం తదితరులు పాల్గొన్నారు.

మాదిగల న్యాయ పోరాటం నెరవేరింది

నవతెలంగాణ-మర్కుక్

మూడు దశాబ్దాల మాదిగల న్యాయ పోరాటం నెరవేరిందని ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు చేబర్తి యాదగిరి మాదిగ, ఎంజేఏఫ్ సీనియర్ నాయకులు జాలని యాదగిరి మాదిగలు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడంతో గురువారం రాత్రి మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకుని, సంబురాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్లతో మాదిగలు, ఉపకులాలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో నష్టం జరుగుతుందనీ, ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించడం ద్వారా అన్ని ఉపకులాలకు న్యాయం



జరుగుతుందన్నారు. మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్‌ను 1994లో ఏర్పాటు చేసి ముప్పై ఏండ్లుగా సబ్బండ వర్గాల సహకారంతో అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి సుప్రీం కోర్టు ధర్మాసనానికి అనుకూలంగా నివేదిక ఇవ్వడంలో ప్రధాన భూమిక పోషించిన భారత ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్‌షాలకు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, వర్గీకరణ అమలు తక్షణమే చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు, ఈ తీర్పు ద్వారా దీనికి సహకరించిన సబ్బండ వర్గాల ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేబర్తి శ్యామల, చిన్ని, కృష్ణ, దయాకర్, బలరాం, మహేష్, శ్రీరామ్, కుమార్, శ్యాంసుందర్, రాజ్ కుమార్, బాస్కర్, బాను, నర్సింలు, బాలనర్సయ్య, తదితరులున్నారు.

రాజీనామాకు సిద్ధంగా ఉండు హరీశ్ రావు

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు

నవ తెలంగాణ - సిద్దిపేట



ఆగస్టు చివరిలోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సీఎం రేవంత్ రెడ్డి చేస్తారని, ఇచ్చిన మాటకు కట్టుబడి హరీశ్ రావు తన పదవికి రాజీనామా చేయాలని, తాను రిక్వెస్ట్ చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే పూర్తి సమయం సిద్దిపేటకు కేటాయిస్తానని, హరీష్ రావును తోటపల్లికి పంపించే వరకు నిద్రపోనని అన్నారు. ప్రతి ఊరు ఊరు తిరుగుతూ సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, మున్సిపల్‌ని కైవసం చేసుకోవడానికి తాను అండగా ఉంటానని కార్యకర్తలకు ధైర్యం ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు చింతమడకలో ఇంటింటికి రూ.10 లక్షలు, ఖమ్మంలో మీడియా వారికి ఇండ్లు ఇచ్చారని, హుజురాబాద్‌లో నచ్చిన పనులు చేశారని, అలా కకుండా రాష్ట్రంలో ఉన్న అందరూ సమానంగా ఉండే విధంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. పక్షపాతంగా రాష్ట్రంలో రెండు, మూడు నియోజకవర్గాలే అభివృద్ధి జరిగాయని, సిద్దిపేట లాగా రాష్ట్రం అభివృద్ధి చెందే విధంగా సీఎం రేవంత్ రెడ్డి పథకాలను రూపొందిస్తున్నాడని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రుణమాఫీ జరగలేదని, వారు మాత్రం లక్షల కోట్లు దోచుకున్నారని, ప్రజలపై భారం వేసారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను 100 శాతం అమలు చేస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీనీ వదిలిపెట్టేది లేదని అన్నారు. మెదక్ డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ లభించిందని, సమానత్వం వచ్చిందని, ప్రజాస్వామ్యం బ్రతకాలంటే కాంగ్రెస్తోనే సాధ్యమని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో మట్టి మాఫియా, ధరణి మాఫియా, మెడికల్ మాఫియా, ఇసుక మాఫియా దోచుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, భూమిరెడ్డి, ఖలీముద్దీన్, అజ్మత్, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేద్దాం

- దోమలను తరలి కొడుదాం
- మున్సిపల్ కమిషనర్ నరసయ్య

నవతెలంగాణ- గజ్వేల్



ప్రజా సమస్యల పట్ల పరిష్కారం కోసం బాధ్యతగా పనిచేద్దామని, దోమలను తరిమి కొడుదామని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్న రాజమౌళి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని, 5,16, వార్డులలో కౌన్సిల్ సభ్యులతో కలిసి విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేస్తూ మున్సిపల్ పరిధిలో నెలగొన్న సమస్యలను పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు. సీజన్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అందులో ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ సిబ్బంది అధికా రులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల వైద్య సిబ్బందితోపాటు మున్సిపల్ సిబ్బంది వార్డుల వెళ్లినప్పుడు అవగాహన కల్పించాలని ఇంటి శుభ్రతతో పాటు పరిసర ప్రాంతాల శుభ్రతను వివరిం చాలన్నారు. వనం మనం కార్యక్రమం మున్సిపల్‌లో విజయవంతంగా జరిగిందని ప్రతి ఇంటికి మొక్కలు పెంపకం చేపట్టినట్లు చెప్పారు. మొక్కల పరిం`క్షణ కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో కౌన్సిల్ సభ్యులు భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, శ్యామల మల్లేశం యాదవ్, మున్సిపల్ అధికారులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

నవతెలంగాణ- మర్కుక్



ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు గీసు మల్లేశం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. ఎన్నో త్యాగాలకు గౌరవం దక్కిందని, దశాబ్దాల కల నెరవేరి మాదిగ, మాదిగ ఉపకులాలకు, దళితులకు ఇది పండుగ రోజన్నారు. ఇంటింటా సంబురాలు చేసుకునే రోజు ఎస్సీ వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తెలంగాణ ఉద్యమం నుంచే బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి అసెంబ్లీ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపించారని చెప్పారు.

నవతెలంగాణ- రాయపోల్



ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని యూత్ కాంగ్రెస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు సూరంపల్లి ప్రవీణ్ అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర్పు వెలువరించిన రాజ్యాంగ ధర్మాసనానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలుచేస్తామని శాసనసభలో కీలక ప్రకటన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. విద్య, ఉద్యోగ, ఇతర రంగాల్లో ఉపకులాలకు ప్రయోజనం చేకూరేలా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందంటూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పిన నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ అమలుపై అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేయడం శుభ పరిణామం అన్నారు. సీఎం అసెంబ్లీలో చెప్పినట్లుగా ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతోన్న ఉద్యోగ నియామకాల ప్రక్రియలో కూడా మాదిగ, మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచమి వినోద్, పంచమి రామస్వామి, మైసిగారి శ్రీనివాస్, పంచమి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బెజ్జంకి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని దాచారం గ్రామ కాంగ్రెస్ నాయకుడు తప్పెట పరుశరాం శుక్రవారం ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి న్యాయవాదులతో బలమైన వాదనలు వినిపించి తోడ్పాటును అందించడం ఆనందనీయమని, వర్గీకరణ సాధనకు దశాబ్దాలుగా పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులకు పర్శరాం కృతజ్ఞతలు తెలిపారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి



-ఆగస్టు 5వ తేదీతో ముగుస్తున్న గడువు
-మండల వ్యవసాయ అధికారి నరేష్

నవతెలంగాణ - కొమురవెల్లి

మండలంలోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీతో గడువు ముగిసిపోతుందని, 2024 జూన్ 28 లోపు పట్టాదారు పాసుబుక్ పొంది 18 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని చెప్పారు. అర్హత కలిగిన రైతులు దరఖాస్తు ఫారంతో ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ కాపీలను జత చేసి గ్రామాలలో ఏఈఓలకు ఇవ్వాలని తెలిపారు. బీమా పొందిన రైతు ఏదైనా కారణం చేత మరణిస్తే రైతు నామినీకి రూ.5 లక్షల బీమా అందించబడతాయన్నారు

అధికారుల సేవలు మరువలేనివి

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం
మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ

నవతెలంగాణ - సిద్దిపేటరూరల్



గ్రామాల అభివృద్ధికి మండల అధికారులు గ్రామపంచాయతీ అధికారులు సేవలు మరువలేనివని మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని రెడ్డి ఫంక్షన్ లో మాజీ ఎంపీపీ బాలకృష్ణ ఆధ్వర్యంలో మాజీ ప్రజా ప్రతినిధులకు, బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం చేశారు. సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అనేక సేవలు చేశామని జీవితంలో ప్రజలకు సేవ చేయడం సంకల్పం అన్నారు. అలాగే బదిలీపై వెళ్తున్న అధికారుల సేవలు గ్రామములో ఎప్పుడూ నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, అధికారులు, పాల్గొన్నారు.

స్మిత సబర్వాల్ వ్యాఖ్యలను ఎవరూ ఖండించడం లేదు

నవతెలంగాణ - సిద్దిపేట



సీనియర్ ఐఏఎస్ అధికారిని స్మితసబర్వాల్ దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలకు నిరసనగా దివ్యాంగుల సమాజం మొత్తము రోడ్లమీదకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఎవరు స్పందించలేదని, సబిత ఇంద్రారెడ్డి పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశాడని రాజకీయ నాయకులు ధర్నాలు, దిష్టిబొమ్మలు దగ్గం చేస్తున్నారని దివ్యాంగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జింక యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ స్మిత సబర్వాల్ దివ్యాంగులు అని చూడకుండా, మా మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఇంతవరకు ఏ ఒక్క రాజకీయ నాయకుడు అసెంబ్లీలో స్పందించలేదని అన్నారు. తమకోసం కూడా నాయకులు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమములో సంఘం నాయకులు నారాయణ, సువర్ణ, కెమ్మసారం అశోక్, లక్ష్మీ, నరసింహ చారి, రాజు, వెంకట్ రెడ్డి, శ్రీను, బొంగుని శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్ ఎన్సి రాజమౌళికి ఆహ్వానం

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో జరిగే నాగుల పంచమి వేడుకలకు హాజరుకావాలని వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మున్సిపల్ చైర్మెన్ ఎన్సి రాజమౌళి ఆహ్వాన పత్రిక అందజేశారు. శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ నివాసంలో లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో లోకకల్యాణం కోసం ఈ నెల 9వ తేదీ లక్ష్మీ నారాయణస్వామికళ్యాణంనిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా నాగుల పంచమి వేడుకలు, నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా మున్సిపల్ చైర్మెన్ ఎన్సి రాజమౌళిగారి తనయుడు ఎన్సీ సంతోష్కు ఆహ్వాన పత్రిక అందజేశారన్నారు. అలాగే ఆర్యవైశ్య నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేశారన్నారు.

సిద్దిపేటకు వస్తే నిధులతో రండి

నవతెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేటకు ఎవరైనా రావచ్చని కానీ సిద్దిపేట నియోజకవర్గంలో ఆగిపోయిన నిధులను తీసుకువస్తే తాము కూడా సంతోషిస్తామని మాజీ మున్సిపల్ చైర్మెన్ కడవేర్గు రాజనర్సు, మాజీ ఏఎంసీ చైర్మెన్ పాల సాయిరాం, మున్సిపల్ వైస్ చైర్మెన్ జంగిటి కనకరాజు, సీనియర్ నాయకులు గుండు భూపేష్లు అన్నారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కాలేజీని కొండగల్కు తరలించడంపై స్థానిక కాంగ్రెస్ నాయకుల వైఖరేంటో చెప్పాలని ప్రశ్నించారు. సిద్దిపేట అభివృద్ధిని ఓర్వలేని వారే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా కేంద్రంలో నిర్మించిన మెడికల్ కళాశాలకు నిధులు తీసుకురావాలని కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావుకు సూచించారు. ఎంపీ ఎన్నికల్లో తన సొంత నియోజకవర్గమైన మల్కాజిగిరితో పాటు తన కుమారుడు ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ స్థానంలో కూడా మైనంపల్లి గెలిపించుకోలేక పోయారని ఎద్దేవా చేశారు.నాయకులు వజీర్, మోహిజ్, రాములు, రామ రాజు, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు, రూ.67,920లు స్వాధీనం

రూ.67,920 వేల డబ్బులు, 10 మొబైల్ ఫోన్లు, 4 మోటర్ సైకిల్లు, 3 కార్లు స్వాధీనం

నవతెలంగాణ -ములుగు



సిద్దిపేట జిల్లా ములుగు మండలం క్షీర సాగర్ గ్రామ శివారులోని ఫామ్ హౌస్లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పోలీసులకు గురువారం సాయంత్రం వచ్చిన పక్కా సమాచారంతో ములుగు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.67,920లు, 10 సెల్ ఫోన్లు, 4 మోటర్ సైకిల్లు, 3 కార్లు, స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ పేకాట స్థావరం క్షీరసాగర్ గ్రామానికి చెందిన బొడ్డు నరసింహులు, బోయినపల్లికి చెందిన గడ్డం ప్రవీణ్ యాదవులు నిర్వహిస్తున్నట్లు పోలీస్ విచారణలో తేలింది. వీరిపై కూడా కేసు నమోదు చేశారు. చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే లేక ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు లేక ములుగు పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ విజయ్కుమార్ తెలిపారు.

శాకాంబరిగా అమ్మవారి దర్శనం

నవతెలంగాణ - సిద్దిపేట

వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో రేణికింది శైలజ శివకుమార్ ఇంటిలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి కూరగాయలతో, ఆకుకూరలతో శాఖాంబరిగా అందంగా అలంకరించి, పారాయణాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మర్యాల వాణి, శైలజ, వెంకటలక్ష్మీ, రమ్య, చంద్రకళ, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బెదరమైన సంతోష్ (28) గురువారం రాత్రి 7:30 సమయంలో తన ఇంట్లో ఉన్న బల్బు ప్లగ్ను స్విచ్ బోర్డ్ లో పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై బాల్ రాజ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుని బరిలో కరాటే మాస్టర్

యూత్ సమస్యలపై పోరాటం చేస్తా
ఒక్కసారి అధ్యక్షునిగా అవకాశం ఇవ్వండి
కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్

నవతెలంగాణ - దుబ్బాక రూరల్



దుబ్బాక అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుని బరిలో నిలిచినట్టు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం దుబ్బాక మండల కేంద్రంలో విలేఖర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో 10 ఏళ్లుగా పార్టీకి సేవ చేస్తున్నానని, మహిళలకు ఉచితంగా కరాటే శిక్షణ అందించి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి ఉన్నత శిఖరాలకు చేర్పించడంతో పాటు కరాటే విద్యార్థులను రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కరాటే పోటీల్లో బంగారు పథకాలను సాధించే దిశగా శిక్షణను అందించానన్నారు. తాను ఇప్పుడు దుబ్బాక నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షునిగా బరిలో నిలిచానని, నాపై నమ్మకం ఉంచి నన్ను మీ అమూల్యమైన ఓటుతో గెలిపించాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడ కార్యక్రమం చేసిన ముందుండి పాల్గొని పార్టీకి అనేక సేవలు అందించాలని వారన్నారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే యువత కోసం కొట్లాడి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అంది స్తానన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జరగబోయే ఆన్లైన్ ఓటింగ్లో మీ యొక్క అమూల్యమైన ఓటును నాకు అనగా బురాని శ్రీకాంత్కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎల్లమ్మ పంచమి వేడుకలకు ఆహ్వానం

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుక ఎల్లమ్మ దేవాలయం అధ్యక్షులు వంగపల్లి అంజయ్య స్వామి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డికి పంచమి వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 9వ తేదిన నాగుల పంచమి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ కార్యక్రమానికి హాజరవు తానని పేర్కొన్నారు. వంగపల్లి అంజయ్య స్వామి సేవలు అభినందనీ యమన్నారు. ప్రజలను భక్తి మార్గం వైపు మల్లే విధంగా కృషి చేస్తూ ప్రతి మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నా రన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు.

ముదిరాజ్ కులాన్ని బీసీ ఏలో కలపాల్సి

- ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు.

నవతెలంగాణ- రాయపోల్

బీసీ(డి) లో ఉన్న ముదిరాజ్ కులాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం ఓట్ల కోసం రాజకీయ పార్టీలు బీసీ(ఏ) లో కలుపుతామని ప్రకటనలు చేస్తున్నారని ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ బీసీ(ఏ) కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు అన్నారు. శుక్రవారం బీసీ(డీ) ముదిరాజ్ కులాన్ని బీసీ(ఏ)లో కలపొద్దని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ(ఏ)లో కులవృత్తులు, సంచార జాతులు, భిక్షాటన చేసుకుని జీవించే 57 కులాలు ఉన్నాయని, 1970 ఏడాదిలో 7 శాతం రిజర్వేషన్ కల్పించారు. అనంతరం 13 గుర్తింపులేని కులాలను బీసీ(ఏ)లో కలిపినప్పటికీ రిజర్వేషన్ మాత్రం అదే 7 శాతం అమలు చేస్తున్నారు. బీసీ(ఏ)లో ఉన్న కులాల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని ఆర్థికంగా సామాజికంగా చాలా వెనుకబాటుకు గురవుతున్నారు. 1968 ఏడాదిలో అనంతరామన్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా సామాజికంగా వెనుకబడిన కులాల జీవన స్థితిగతులను అధ్యయనం చేసి అట్టి కులాలను బీసీ(ఏ) జాబితాలో పొందుపరిచారు. కాబట్టి బీసీ(ఏ) కుల జాబితాలో ముదిరాజులను చేరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ రాములు, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు యాద సురేందర్, గంగిరెద్దుల సంఘం జిల్లా అధ్యక్షులు కనకయ్య, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు మైసయ్య, వీరభద్ర సంఘం జిల్లా అధ్యక్షులు ఆగుళ్ల శంకర్, తెలంగాణ రజక సంఘం జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - సిద్దిపేట

టీపీసీసీ సెక్రటరీ గాడి పల్లి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు సిద్దిపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, ఆనంద్, రియాజ్, ఖలీముద్దీన్, షాబుద్దీన్, వహీద్ ఖాన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.